
సోమవారం 25.05.2026
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 34 సంచిక - 33 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



చంద్రబాబు నాయుడిని ఫ్యాక్షనిస్టుగా చిత్రీకరించాలన్న జగన్ ప్రయత్నాలు ఫలించవు. చంద్రబాబుకు ఫ్యాక్షన్ చరిత్ర లేదు, నేరాల మచ్చ లేదు. ఫ్యాక్షన్, గన్ కల్చర్‌ను రాష్ట్రంలో పెంచాలని చూస్తే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# క్రిటికల్ కేసులకు ప్రభుత్వాసుపత్రులే భరోసా !



**ప్రభుత్వాసుపత్రుల్లోనే క్రిటికల్ సర్జరీల అత్యధిక సక్సెస్ రేట్**

**మంత్రి సత్యకుమార్ ప్రోత్సాహంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న ప్రభుత్వ వైద్యులు**

**సెకండరీ ప్రభుత్వాసుపత్రుల్లో సంక్లిష్ట శస్త్రచికిత్సల పరంపర**

**ప్రైవేట్ ఆసుపత్రులు చేతులెత్తేసిన క్లిష్ట కేసులకు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రాణదానం**

**క్లిష్ట కేసుల్లో ప్రభుత్వ వైద్యుల ప్రతిభకు ప్రశంసలు**

**ప్రభుత్వాసుపత్రుల్లో విజయవంతంగా పూర్తవుతున్న అరుదైన సర్జరీలు**


**ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్, ఇతర సిబ్బందికి మంత్రి సత్యకుమార్ అభినందనలు**






**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ సెకండరీ ఆసుపత్రుల్లో క్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత వరకు కేసులను రిఫర్ చేయకుండా కష్టతరమైన శస్త్రచికిత్సలను సైతం వైద్యులు సెకండరీ ఆసుపత్రుల్లో చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 31 నుంచి ఇటీవల వరకు జరిగిన వాటిలో 32 సంక్లిష్ట శస్త్ర చికిత్సలు ఉన్నట్లు నిశిత పరిశీలన అనంతరం డైరెక్టర్ ఆఫ్ సెకండ్ హెల్త్ ప్రధాన కార్యాలయం గుర్తించింది. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో 18 ఆసుపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచినట్లు వెల్లడయింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధరబాబు మొత్తం 50 వరకు అభినందన లేఖలు పంపారు. మిగతా 2లో...

## శ్రమకు గుర్తింపు...
# శ్రామికులకు గౌరవం



**లేబర్ అడ్డాలతో నూతన అధ్యాయం**

**కార్మికుల నైపుణ్యాలకు పదును పెట్టేలా స్కిల్ ట్రైనింగ్**

**వివాహం నుంచి ప్రసూతి వరకు... కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్ష**

**సేఫ్టీ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక భద్రతలో నూతన ప్రమాణాలు**

**భవన నిర్మాణ కార్మికులకు కూటమి భరోసా**

**ఈఎస్ఐ ఆస్పత్రులలో సరికొత్త డిజిటల్ విప్లవం**

**రెక్కల కష్టానికి రక్షణగా నిలిచిన ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలన**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తూ, సమాజానికి వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లల్లో విప్లవాత్మక అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధాన లోపాలు, నిధుల దారి మళ్లింపుతో కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను పునరుద్ధరిస్తూ కొత్త ఆశలు చిగురింపజేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, అటు పారిశ్రామిక అభివృద్ధిని, ఇటు కార్మికుల ప్రాణ భద్రతను సమానంగా ముందుకు తీసుకెళ్తూ కార్మిక శాఖలో సరికొత్త ప్రగతి ఆవిష్కృతమైంది.

# 'ఎబోలా'పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం!

- కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు చేసేలా చర్యలు
- విశాఖ, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ విమానాశ్రయాలపై ప్రత్యేక దృష్టి!
- అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ విస్తృతి, కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మిగతా 2లో...

## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల కొలిమి.. ఒక్క రోజులోనే 56 మంది మృతి




2

## దేశవ్యాప్తంగా 100 ఇండస్ట్రియల్ పార్కులు



## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు : మంత్రి నారాయణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్ జగన్ కుటుంబానికి ఉన్న రక్త చరిత్ర గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి నారాయణ విమర్శించారు. ఆదివారం నెల్లూరు జిల్లాలో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వైఎస్ కుటుంబ రక్త చరిత్ర రాష్ట్ర ప్రజలకు తెలియడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని మంత్రి నారాయణ జోస్యం చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. మిగతా 2లో...

## భూమన కరుణాకర్‌పై పోలీస్ కేసు నమోదు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ టీటీడీ ఈఓ భూమన కరుణాకర్ రెడ్డిపై పోలీస్ కేసు నమోదయింది. టీడీపీ నేత మహేశ్ యాదవ్.. భూమన కరుణాకర్ రెడ్డిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మిగతా 2లో...

## రైతాంగానికి అండగా కూటమి ప్రభుత్వం

- వ్యవసాయం నుంచి ఆక్వా వరకు ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి
- ఎండలు, మార్కెట్ సంక్షోభాలపై హై అలర్ట్
- ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారంపై మంత్రి అచ్చెన్నాయుడు ఫోకస్
- ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం
- రైతులకు సాంకేతిక సహాయం, సబ్సిడీలు, మార్కెట్ మద్దతు
- రైతులు ఆందోళన చెందవద్దు
- రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీ లేదు
- వైసీపీ అసత్య ప్రచారాలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్
- గత ఐదేళ్లు రైతులు అగాధంలోకి వెళ్లారు...కూటమి ప్రభుత్వంలోనే మంచి ధరలు లభిస్తున్నాయన్న మంత్రి అచ్చెన్న



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రైతులు, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వా రంగాలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కూటమి ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా పనిచేస్తోందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా లభ్యత నుంచి మొక్కజొన్న ధరలు, రొయ్యల మార్కెట్ పరిస్థితులు, కొబ్బరి రైతుల సమస్యలు, అనంతపురం నీటి ఎద్దడి వరకు ప్రతి అంశంపై వ్యవసాయ, అనుబంధ శాఖల డైరెక్టర్స్ తో మంత్రి జూమ్ సమావేశం నిర్వహించి ప్రతి అంశంపై లోతైన చర్చ జరిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు సంక్షేమం విషయంలో మిగతా 3లో...

## పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్వోసీలను ఎప్పటికప్పుడు అందిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలకు కష్టకాలంలో అండగా నిలబడుతున్నామని పేర్కొన్నారు. సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిగా మారిందని తెలిపారు. జగన్ హయాంలో సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు చెల్లించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ధ్వజమెత్తారు. మిగతా 2లో...

## 'లేపాక్షి'కి సాంకేతిక హంగులు

- హస్త కళారూపాల అమ్మకాల పెంపే లక్ష్యం
- తరంగా ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ రూపకల్పన
- రాష్ట్ర స్థాయి నుంచే లేపాక్షి షో రూమ్ ల పర్యవేక్షణ
- ఏ రోజుకారోజు స్టాక్, అమ్మకాల వివరాల నమోదు
- స్టాక్ పై ఎప్పటికప్పుడు అలెర్ట్స్
- ఇంటికే హస్త కళారూపాలు అందించేలా కళాక్షి వాట్సాప్ లింక్ రూపకల్పన
- ఏఐ టూల్ తో లింక్ లో హస్త కళల సమాచారం
- వాట్సాప్ లోనే హస్త కళలకు ఆర్డర్లు... డోర్ డెలివరీ
- హస్త కళాకారులకు గౌరవ ప్రద జీవనమే లక్ష్యం : మంత్రి సవిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హస్త కళారూపాలు కేవలం వస్తువులే కాదు ఆయా ప్రాంతాల సాంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలు. వారసత్వ ప్రదాతలు హస్త కళాకారులు. చరిత్రకు ఆనవాలుగా నిలిచే హస్త కళలకు, హస్త కళాకారులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. హస్త కళాకారులకు గౌరవప్రదమైన జీవనం అందిస్తూనే, హస్త కళారూపాలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు సాంకేతికతను సాధనంగా వినియోగిస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో పాటు కళాకారుల గుర్తింపు, సృజనాత్మకతతో వారు రూపొందించే కళా రూపాలను సామాన్య ప్రజలకు సైతం సకాలంలో అందించేలా మిగతా 3లో...

## 2 నెలలు హార్మూజ్ ఓపెన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దీర్ఘకాలంగా ఇరాన్–అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణానికి తెరదించే దిశగా ఒక కీలకమైన ముసాయిదా ఒప్పందం తుది దశకు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వివిధ మధ్యవర్తిత్వ దేశాల ప్రమేయంతో మిగతా 2లో...

## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు : మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)


కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేస్తోంటే.. ఉద్దేశపూర్వకంగానే జగన్ అండ్ కో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇక టీడీపీ అధిష్ఠానం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈసారి వర్చువల్ గా వేడుకలు జరుగుతాయని మరోసారి గుర్తుచేశారు. వర్చువల్ మహానాడులోనూ రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు.

## భూమన కరుణాకర్‌పై పోలీస్ కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

శాప్ ఛైర్మన్ రవినాయుడుపై భూమన దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి కావాలనే తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అలిపిరి రోడ్డులో షాపులు తొలగించడానికి, రవినాయుడికి ఏ సంబంధం లేదని, అయినా అంతా ఆయనే చేయించారని అసత్య ఆరోపణలు చేశారన్నారు. తమ ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని మహేశ్ యాదవ్ ఈ సందర్భంగా హెచ్చరించారు. భూమన నోరును ఇకపై అయినా అదుపులో పెట్టుకోవాలని, అధికారం లేకపోవడంతో పిచ్చెక్కి ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

## 2 నెలలు హార్మూజ్ ఓపెన్



(మొదటి పేజీ తరువాయి)

ఈ 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం దాదాపు ఖరారైనట్లు ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలోని కీలక అంశాలు ఇవే..

హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని 60 రోజుల పాటు ఎలాంటి పన్నులు లేకుండా స్వేచ్ఛా నౌకాయానం కోసం తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. ఇందులో భాగంగా జలసంధిలో తాము అమర్చిన మందుపాతరలను తొలగించేందుకు ఇరాన్ సమ్మతించింది. దానికి ప్రతిగా, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయనున్నారు. దీనివల్ల ఇరాన్ ప్రపంచ దేశాలకు మళ్లీ స్వేచ్ఛగా చమురు విక్రయించుకునే వీలు కలుగుతుంది.

**అణు కార్యక్రమాలపై చర్చలు :** ఈ 60 రోజుల కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ తన అణు కార్యక్రమాలను నిలిపివేయడం, యురేనియం ఎన్రిచ్మెంట్ ను పరిమితం చేయడం, తన వద్ద ఉన్న నిల్వలను వదులుకోవడం వంటి అంశాలపై ఇరుదేశాల మధ్య లోతైన చర్చలు జరగనున్నాయి. అయితే, ఇరాన్ ప్రాథమికంగా వీటికి సంబంధించి కొన్ని మౌఖిక హామీలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది.

**నిధుల విడుదల :** ఈ ఒప్పందం ప్రకారం అమెరికా, దాని మిత్రదేశాలు ఇరాన్‌పై ఎలాంటి దాడులు చేయకూడదు. అదేవిధంగా ఇరాన్ కూడా అమెరికా లేదా దాని మిత్రపక్షాలపై ముందస్తు దాడులకు దిగకూడదనే నిబంధనను చేర్చారు. ఈ శాంతి ప్రక్రియలో భాగంగా ఖతార్ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్‌కు చెందిన 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 55 వేల కోట్లు) ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు సమాచారం. అంతేకాకుండా, లెబనాన్‌లో (ఇజ్రాయెల్–హిజ్బుల్లా మధ్య) కాల్పుల విరమణ అంశం కూడా ఈ చర్చల పరిధిలో భాగమైనట్లు తెలుస్తోంది.

**బలగాల ఉపసంహరణ అప్పుడే :** ఈ 60 రోజుల తాత్కాలిక వ్యవధిలో ఆర్థిక ఉపశమనం అనేది ఇరాన్ పై ఆధారపడి ఉంటుందని అమెరికా స్పష్టం చేసింది. ప్రస్తుతం ప్రాంతీయ రక్షణ కోసం మోహరించిన అమెరికా సైనిక దళాలు ఇప్పుడే వెనక్కివెళ్లవని, ఇరుదేశాల మధ్య పూర్తిస్థాయి తుది ఒప్పందం కుదిరి, అది పూర్తిగా నిరూపితమైన తర్వాతే తమ బలగాల ఉపసంహరణ ఉంటుందని వాషింగ్టన్ అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. కాగా ఈ చర్చల మధ్యవర్తిత్వంలో పాకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాలు కీలక పాత్ర పోషించాయి. ఈ ఒప్పందం కనుక విజయవంతంగా అమలైతే ప్రపంచ మార్కెట్లో చమురు సంక్షోభం తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట లభించనుంది.

## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల కొలిమి.. ఒక్క రోజులోనే 56 మంది మృతి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఓ వైపు ఆయా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికి.. మరో వైపు తెలుగు రాష్ట్రాలను భానుడి భగభగలు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలను ముంచెత్తుతున్న వడగాడ్పుల తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండటంతో ఎండల తీవ్రతకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. గడిచిన 24 గంటల్లోనే రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వడదెబ్బ కారణంగా మొత్తం 56 మంది మరణించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇందులో ఒక్క తెలంగాణలోనే అత్యధికంగా 40 మంది ప్రాణాలు కోల్పోగా, ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది వడదెబ్బకు బలయ్యారు.


జిల్లాల వారీగా మరణాల వివరాలను పరిశీలిస్తే, తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా 19 మంది మృతి చెందారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో ఆరుగురి చొప్పున ప్రాణాలు కోల్పోగా, ఆదిలాబాద్‌లో ఇద్దరు, నిజామాబాద్‌లో ఒకరు మరణించారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎండల తీవ్రతకు గుంటూరు, పల్నాడు, విజయవాడ, అనకాపల్లి, ఏలూరు తదితర జిల్లాల్లో మరణాలు నమోదయ్యాయి. ఈ ఘోర పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం పూట ఇళ్ల నుంచి బయటకు రావద్దని, తగినన్ని ద్రవాహారాలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఇరు రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.

# క్రిటికల్ కేసులకు ప్రభుత్వాసుపత్రులే భరోసా !

(మొదటి పేజీ తరువాయి)

గిరిజన ప్రాంతంలో ఉన్న రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో టోటల్ నీ రీప్లెస్మెంటు జరిగింది. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో రెక్టల్ ప్రొలాప్స్, భారీ ఫైబ్రాయిడ్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను అక్కడ వైద్యులు విజయవంతంగా ముగించారు. ఇలా ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, సహచరులు కూడా ఇదేవిధంగా స్పందిస్తే రోగుల ఆరోగ్యానికి భరోసా మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

**ఏరియా ఆసుపత్రుల్లో సైతం.. :** టీచింగ్ ఆసుపత్రుల్లో మాదిరిగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులో ఆధునిక సౌకర్యాలు, ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాల్టీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉండరు. అయినప్పటికీ సెకండరీ హెల్త్ వైద్యుల్లో అనేక మంది వృత్తిపట్ల నిబద్ధతను పాటిస్తూ పెద్దాసుపత్రులకు కేసులు రిఫర్ చేయకుండా స్థానికంగానే పరిమిత సౌకర్యాల మధ్య శస్త్రచికిత్సలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారని డీఎస్ హెచ్ కేవీఎన్ చక్రధరబాబు తెలిపారు. దీనివల్ల రోగులకు వ్యయప్రయసాలు తగ్గుతున్నాయని, వారిపై ఆర్థిక భారం తగ్గుతుందని, విలువైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే అనారోగ్యం నుంచి త్వరగా కోరుకుంటున్నారని తెలిపారు. వృత్తిపట్ల నిబద్ధతను పాటించే వారిని తగిన ప్రమాణాలతో



గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు అనుసరించి ఎప్పటికప్పుడు అభినందన లేఖలు పంపుతున్నామని వివరించారు.

**తొలి కాన్పు సిజేరియన్-రెండో కాన్పు సహజ ప్రసవం! :** అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు కూడా సిజేరియన్ ద్వారా జరగాల్సిన ప్రసవాన్ని సహజ విధానంలో జరిగేలా చేశారు. ఓ మహిళకు తొలి కాన్పు సిజేరియన్ విధానంలో జరిగింది. రెండో కాన్పు కోసం ఇక్కడికి రాగా.. సహజ విధానంలో జరిగేలా వైద్యులు, నర్సులు కృషిచేశారు.

**స్కిన్ ట్రాన్స్ ప్లాంట్:** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఆసుపత్రిలో చేరిన సదరు రోగి శరీరం పై ఉన్న చర్మంలో 26% ఒకచోట తొలగించి, మరోచోట ట్రాన్స్ ప్లాంట్ చేశారు. ఇదే ఆసుపత్రిలో అరుదైన హెర్నియా రీపేర్స్ (స్పైజిలియన్, ఆభూరేటర్, సయాటిక్), సర్జరీ జరిగింది.

**16 నెలలు 511 క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు :** ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు 16 నెలల్లో 511 క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేశారు.

రంపచోడవరం ఏరియా హాస్పిటల్ లో "నీ రీప్లేస్మెంట్ "

గిరిజన ప్రాంతమైన రంపచోడవరంలోని ఏరియా ఆసుప్రతిలో ఒకరికి " నీ రీప్లేస్మెంట్ " జరిగింది టీచింగ్ ఆసుపత్రుల్లో జరగాల్సిన ఈ తరహా సర్జరీలు గిరిజన ప్రాంతంలో జరగడం గమనార్హం.

"చింతపల్లి ఏరియా ఆసుపత్రి (గిరిజన ప్రాంతం) లో ఒకరికి రెక్టల్ ప్రొలాప్స్ (మలద్వారం నుంచి పేగు బయటకు రావడం) సర్జరీ జరిగింది. ఇదే ఆసుపత్రిలో భారీ ఫైబ్రాయిడ్ సమస్య (గర్భాశయంవద్ద పెద్ద కణితి)తో బాధపడుతున్న మరో రోగికి హిస్టరెక్టమీ చేశారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో నూ ఇటువంటి శస్త్ర చికిత్స జరిగింది.

సహజ ప్రసవం ద్వారా 4.8 కిలోల శిశువు జననం, అనకాపల్లి జిల్లా అసుపత్రిలో 4.8 కిలోల శిశువు జననం సహజ ప్రసవం ద్వారా జరిగింది. అరకు ఏరియా ఆసుపత్రిలో ఓ మహిళ కడుపు నుంచి 9 కిలోల కణితిని తొలగించారు.

తెనాలి జిల్లా ఆసుపత్రిలో ఆర్థో వైద్యులు వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మహిళలకు వేసంక్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి, వారి ప్రాణాలు కాపాడారు.

**జాతీయ కార్యక్రమాల అమల్లో :** జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అభా, ఎన్క్వాస్, ఎన్బీఎసీయూ, ఎస్–ఎన్సీయూ, ఎన్సీడీ, ఇతర కార్యక్రమాల అమల్లో 18 ఆసుపత్రులు ఉత్తమ ప్రతిభకనబరిచాయి.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహించే ధర్మవరంలోని ఏరియా, పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆదోని, అనపర్తి ఏరియా ఆసుపత్రి, పెద్దాపురం సీహెచ్సి, అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, ఇతర ఆసపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచినట్లు డీఎస్ఎహెచ్ చక్రధరబాబు తెలిపారు.

**నలుగురికి లాప్రోస్కోపిక్ ద్వారా సర్జరీలు :** ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో గడిచిన 10 రోజుల్లో కాలంలో నాలుగు లాప్రోస్కోపిక్ సర్జరీలు జరిగాయి. కడుపు నొప్పితో బాధపడే వారిలో అవసరమైన వారికి అత్యాధునిక సౌకర్యాల మధ్య కుట్లు లేని ఈ సర్జరీలు జరుగుతుండడంతో రోగులు త్వరగా కోలుకుంటున్నారు. రూ. 37 లక్షలతో ఆత్యాధునిక లాప్రోస్కోపిక్ ఎక్విప్మెంట్ ఇక్కడ అందుబాటులోనికి వచ్చింది.

## శ్రమకు గుర్తింపు... శ్రామికులకు గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికుని సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, రక్షణే ధ్యేయంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. వివిధ రంగాల్లోని కార్మికులకు స్కిల్ అప్ గ్రేడ్ అయ్యేలా వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇదే సమయంలో వారి గౌరవాన్ని మరింత పెంచేలా లేబర్ అడ్డాలను నిర్మించడం.. వారి సంక్షేమం కోసం నిధులు కేటాయించడం.. అలాగే వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆస్పత్రుల నిర్మాణం వంటివి చేపట్టడం వంటి చర్యలు తీసుకుని కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఈ రెండేళ్ల పాలనలో జరిగిన పరిణామాల బట్టి కచ్చితంగా చెప్పొచ్చు.

**లేబర్ అడ్డాలతో కార్మికులకు సరికొత్త వైభవం:** రోజువారీ ఉపాధి కోసం ఉదయాన్నే రోడ్ల పక్కన, కూడళ్లలో ఎండనక, వాననక నిలబడి ఎదురుచూసే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలతోపాటు... ఉమ్మడి జిల్లాల కేంద్రంగా లేబర్ అడ్డాల నిర్మాణాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆధునిక ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్స్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ లేబర్ అడ్డాల ద్వారా కార్మికులకు ఒకే చోట స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులతో పాటు ఉద్యోగ సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్నారు. పని ఉన్నప్పుడు అక్కడి నుంచి పనులకు వెళ్తారు.. పనులు లేనప్పుడు ఆ సమయాన్ని స్కిల్ అప్ గ్రేడ్ చేసుకునేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లోని కార్మికులకు ఉన్న అనుభవానికి టెక్నాలజీని జోడిస్తే.. వారికి మరింత మెరుగైన ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో నైపుణ్యాలు కల్పించేలా కటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కార్మికులను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర నిర్మాణంలో వారిని కీలక




భాగస్వాములను చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.

**నిలిచిన పథకాలకు జీవం పోస్తూ... శ్రామిక లోకానికి అండ నిలుస్తూ :** రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మందికి పైగా నమోదైన అసంఘటిత కార్మికులు ఉండగా, అందులో 18 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత ఐదేళ్ల కాలంలో డూప్లికేషన్ సాకుల పేరిట, నిధుల దారి మళ్లింపుతో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు ధీమా కల్పిస్తూ ప్రసూతి సహాయం కింద రూ. 20 వేలు, వివాహ కానుకగా రూ. 40వేలు అందిస్తోంది. అలాగే ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే రూ. 20 వేల సహాయం, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 60 వేలు అందించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు అందిస్తోంది.

**ఫ్యాక్టరీల భద్రతకు పెద్ద పీట :** పారదర్శకత, బాధ్యత, భద్రత అనే మూడు సూత్రాలతో ఫ్యాక్టరీల శాఖను ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్లాంట్లలో ప్రమాదాల నివారణకు జులై–2024 లో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంది. కార్మికుల ప్రాణాలకు రక్షణగా సేఫ్టీ అలర్ట్, ఇన్సిడెంట్ అలర్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రారంభించడమే కాకుండా, ప్రమాదకర రసాయన కర్మాగారాల పర్యవేక్షణకు కెమికల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల సృష్టికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జేఎన్టీయూ, ఎస్వీయూ వంటి ప్రతిష్టాత్మక యూనివర్శిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, 360 పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు, వందలాది మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా పారిశ్రామిక భద్రతలో ఏపీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది.

**ఈఎస్ఐ వైద్య సేవల్లో చారిత్రాత్మక మార్పులు :** రాష్ట్రంలోని 15 లక్షల మంది ఇన్సూర్డ్ పర్సన్స్ ఆరోగ్య రక్షణే ధ్యేయంగా భీమా వైద్య సేవల శాఖను ప్రభుత్వం పూర్తిగా ఆధునీకరించింది. అచ్యుతాపురంలో కొత్త ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగగా, తిరుపతి ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 100కు పెంచింది. గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, నెల్లూరు ప్రాంతాలలో కొత్త ఆసుపత్రుల కోసం భూములను కేటాయించారు. విశాఖపట్నంలో 50 సీట్లతో కూడిన మెడికల్ కాలేజీ మంజూరు కావడం, అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలతో భవిష్యత్ వైద్య అవసరాలకు ఇప్పటి నుంచే కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను రూ. 78 లక్షలతో పునరుద్ధరించి, సరికొత్త మొబైల్ యాప్‌ల ద్వారా ఔషధాల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతను తెచ్చింది. పెట్టుబడుల రాకతో పరిశ్రమలు వృద్ధి చెందడమే కాకుండా, కార్మికుల ప్రాణాలకు, ఆరోగ్యానికి ఢోకా ఉండకూడదనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగింది.

## 'ఎబోలా' పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం !

(మొదటి పేజీ తరువాయి)


ముఖ్య0గా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో 'ఏబోలా' వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాలు, సలహాలు, సూచనల ఆధారంగా 'ఎబోలా' వైరస్ వ్యాప్తి, కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు. ఆఫ్రికాలోని కాశీగో, ఉగాండా దేశాల్లో ఎబోలా తీవ్రత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సదరు దేశాల నుంచి రాష్ట్రంలోనికి వైజాగ్, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులను (ట్రావెల్ హిస్టరీ ఆధారంగా) వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసే విషయంలో ఎయిర్ పోర్ట్ అథార్టీ, సదరు జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి, పక్కనున్న వారికి కూడా వెంటనే వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విశాఖ ఓడరేవు అధికారులతో కూడా మాట్లాడి, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని చెప్పారు. విమానాల ద్వారా కాకుండా రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారి విషయంలోనూ అవసరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎబోలా వైరస్ పీడిత దేశాల నుంచి దేశంలోని వచ్చే ప్రయాణికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ఇందుకు అనుగుణంగా అవసరమైన



సమాచారాన్ని సదరు రాష్ట్రాలకు పంపుతోందని తెలిపారు. కొవిడ్ హయాంనాటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని 'ఏబోలా' విషయంలో ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితులు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏ.ఎన్.ఎం,ఆశా వర్కర్ల నుంచి స్థాయి నుశీచి అందర్నీ 'వర్చువల్' సమావేశాల ద్వారా అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

**ఐసోలేషన్ వార్డులు సిద్ధం:** అంతర్జాతీయ విమానాశ్రయాల నగరాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే 'ఐసోలేషన్' వార్డుల్లో 15 పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారాన్ని జిల్లాలకు పంపుతూ అందర్నీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. పీపీఈ , వైరస్ నిర్ధారణ పరీక్షల కిట్లు తక్షణ అవసరాలకు సరిపడ ఉన్నాయని తెలిపారు.

**ప్రయాణాలు చేయకపోవడం మంచిది :** కేంద్ర ప్రభుత్వం జారీచేసిన అడ్వయిజరీ మేరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప, కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు ప్రయాణించొద్దని మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తిచేశారు.



గత మూడు వారాల కిందట ఎబోలో ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు అనారోగ్యంగా ఉంటే జిల్లా అధికారులకు సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి ప్రజలకు సూచించారు. దీనివల్ల అవసరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

**లక్షణాలు :** ఎబోలా (బుండిబుగ్యో) వైరస్ కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాల్లోని అనేకమందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం కష్టం. వైరస్ సోకిన వారికి కొన్నివారాలపాటు లక్షణాలు బయటపడవు. దీనివల్ల ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలో సోకే అవకాశం ఉంది. సాధారణ జ్వరం, అకస్మాత్తుగా జ్వరం పెరిగిపోవడం, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, తీవ్ర తలనొప్పి, గొంతునొప్పి, కండరాల నొప్పులు, రోజురోజుకి నొప్పులు తీవ్రమవుతుండటం, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ల ఎర్రబారడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ బారినపడిన వారిలో కనిపిస్తున్నాయి.

## దేశవ్యాప్తంగా 100 ఇండస్ట్రియల్ పార్కులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం దేశంలో తయారీ రంగాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేయడానికి 'భవ్య' (భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన) పేరుతో భారీ పారిశ్రామిక పార్కుల పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 100 ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ పథకానికి కేంద్రం రూ. 33,660 కోట్ల నిధులను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్లగ్–అండ్–ప్లే మోడల్‌లో ఈ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. అంటే, పరిశ్రమలు వెంటనే కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన భూమి, రోడ్లు, విద్యుత్, నీరు, గిడ్డంగులు వంటి సదుపాయాలు ముందుగానే సిద్ధంగా ఉంటాయి. ఈ పథకం మొదటి దశలో 20 ఇండస్ట్రియల్ పార్కుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తారు. ఆ తర్వాత మరో 30 పార్కులను ఎంపిక చేసి, మిగిలిన 50 పార్కులను తదుపరి దశలో అభివృద్ధి చేయనున్నారు. ఒక్కో పార్క్ 100 నుంచి 1,000 ఎకరాల విస్తీర్ణంలో ఉండే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగ కంపెనీల సంయుక్త భాగస్వామ్యంతో ఈ పథకం అమలవుతుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ఈ పారిశ్రామిక పార్కులు కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా.. పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, సరఫరా గొలుసుల బలోపేతానికి కూడా దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా తయారీదారులు, సరఫరాదారులు, సేవా సంస్థలు ఒకేచోట ఉండేలా క్లస్టర్ మోడల్‌లో ఈ పార్కులు అభివృద్ధి అవుతాయి. దీంతో లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గడంతో పాటు, ఉత్పత్తి సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ పథకంపై ఆసక్తి చూపినట్లు కేంద్రం వెల్లడించింది.

## పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట




(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలని సీఎం చంద్రబాబు మొదటి నుంచి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పేదలకు ఆర్థికంగా చేయూతను ఇచ్చేలా సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా సీఎం సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి పేదవాడికి సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో రూ. 8 కోట్లు ఇప్పటి వరకు అందజేశామని తెలిపారు.

విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 63 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 87 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్వోసీలను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవ చేస్తున్నారని ప్రశంసించారు. రాత్రింబవళ్లు కష్టపడుతూ, ఎక్కడ ఎవరికీ ఏ ఇబ్బంది వచ్చినా ఆయన సొంతంగా సాయం అందజేస్తున్నారని కొనియాడారు. 20 సంవత్సరాల నుంచి ఇక్కడ పేదవాళ్లకు తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని మంత్రి అనగాని చెప్పుకొచ్చారు.

తాము ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేసినప్పుడు కూడా తమ అందరికీ అన్నగా ఉండి, తమకొక దిక్సూచిగా గద్దె రామ్మోహన్ ఉన్నారని మంత్రి అనగాని ప్రస్తావించారు. విజయవాడలో 22,000 మందికి రాబోయే రోజుల్లో పట్టాలు రానున్నాయని తెలిపారు. గద్దె రామ్మోహన్‌తో పాటు, ఇతర ఎమ్మెల్యేలు విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇవన్నీ రాబోయే ఒకటి, రెండు నెలల్లో రూపకల్పన కాబోతున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## స్మశాన వాటికల అభివృద్ధికి శ్రీకారం



○ నూతక్కిలో ఎస్సీ, ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలోని నూతక్కి గ్రామంలో ఎస్సీ, ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో చేపట్టనున్న పనులకు ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు.

గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. నూతక్కి గ్రామంలోని ఇరు స్మశాన వాటికలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు.

ముఖ్యంగా ఎస్సీ స్మశాన వాటికలో మాల, మాదిగ సామాజిక వర్గాలకు విడివిడిగా అభివృద్ధి పనులు చేపట్టడం విశేషంగా నిలిచింది. అభివృద్ధి పనుల్లో భాగంగా విశ్రాంతి గదులు, స్మశానం లోపల వరకు సీసీ రోడ్లు, నీటి సదుపాయం కోసం బోర్లు, గార్డెనింగ్, చుట్టూ కాంపౌండ్ వాల్, వాష్ ఏరియా, సిమెంట్ బెంచీలు, లైటింగ్, గోడలకు రంగులు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో సొంత నిధుల ద్వారా ఈ పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## జనసంద్రంలా మారిన డి అగ్రహారం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలం డి అగ్రహారంలో ఆదివారం నిర్వహించిన జాతర జన జాతరగా మారింది. వందలాది వాహనాల్లో బంధుమిత్ర సమేతంగా రావటంతో గ్రామం జనంతో నిండిపోయింది. గ్రామంలో గత 41 రోజుల క్రితం నూతన రామలక్ష్మణుల, హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే. తిరిగి 41 వ రోజు గ్రామంలో దేవర కార్యక్రమం ఘనంగా నిర్వహించి అంకాలమ్మ పోలేరమ్మ దేవతమూర్తులకు గ్రామ నడిబొడ్డులో పూజలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకొన్న అనంతరము ప్రతి ఇంటికి విందు కార్యక్రమాన్ని వారి వారి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి పలు పార్టీల నుంచి అధికార అనధికార వ్యక్తులు హాజరయ్యారు. విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు పుట్టా ప్రభాకర్ మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర బి మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి సొసైటీ ప్రెసిడెంట్ సాంబ శివారెడ్డి మండల తెదేపా అధ్యక్షుడు సుబ్బారెడ్డి బ్రహ్మంగారిమఠం ఎంపీడీవో రామచంద్రారెడ్డి మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ టీడీపీ నాయకులు చిలమల నారాయణ చిలమల నాగయ్య పలు ప్రభుత్వ శాఖల అధికారులు మండల స్థాయి నాయకులు హాజరై విందు ఆరగించారు. అంతకుముందు పోలేరమ్మ అంకాలమ్మ దేవతల ఆశీర్వాదం పొందారు. భారీ ఎత్తున విందు ఏర్పాటుచేసిన జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డిని పలువురు అభినందించారు.

# రైతాంగానికి అండగా కూటమి ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మా లక్ష్యం. కానీ వైసీపీ నాయకులు మాత్రం సమస్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ లాభాల కోసం అబద్ధాల ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు వివరించారు. అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోంది. మధ్యవర్తుల దోపిడీని అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వచ్చిన తాత్కాలిక పరిస్థితులను అధిగమించేందుకు మత్స్యశాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సమావేశంలో చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా మార్కెటింగ్ అవకాశాలు పెంచడం, సహాయక చర్యలు చేపట్టడం పై ఉద్యానవన శాఖకు మంత్రి దిశానిర్దేశం చేశారు. నీటి ఎద్దడి పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అసాధారణ ఎండలు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు వంటి సవాళ్ల మధ్య కూడా రైతులు, పౌల్ట్రీ, ఆక్వా, ఉద్యాన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్న భీకర ఉష్ణోగ్రతల కారణంగా పౌల్ట్రీ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, గత నాలుగు రోజులుగా నమోదైన వడగాల్పుల ప్రభావంతో రాష్ట్రంలోని సుమారు 5.5 కోట్ల



కమర్షియల్ లేయర్ కోళ్లలో 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు మరణాలు సంభవించినట్లు ప్రాథమిక అంచనా అని వెల్లడించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఒక్క కోడికి రూ.100 చొప్పున గరిష్టంగా 100 కోళ్ల వరకు, ఒక్క లబ్ధిదారునికి గరిష్టంగా రూ.10,000 వరకు పరిహారం అందించవచ్చని పేర్కొన్నారు. అయితే నష్టం అంచనా రూ.10,000 కంటే అధికంగా ఉన్న సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రత్యేక సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.

గతం ప్రభుత్వంలో 2020-21 ఖరీఫ్‌లో 1,98,092 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.95.62 కోట్ల నష్టం, అదే ఏడాది రబీలో 2,98,391 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.91.50 కోట్ల నష్టం, 2021-22 రబీలో 2,762 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.0.19 కోట్ల నష్టం, 2022-23 రబీలో 71,064 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.2.44 కోట్ల నష్టం సంభవించినప్పటికీ ప్రస్తుతం రైతులకు నష్టం లేకుండా సమర్థవంతమైన విధానంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. రైతులను కాపాడేందుకు మార్క్ ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మీరా వద్ద కొనుగోలు చేయాలని నిర్ణయించి, Price Stabilization Fund (PSF) నుంచి రూ.630 కోట్ల అడ్వాన్స్ మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు.

అనంతపురం జిల్లాలో గార్లదిన్నె, సింగనమల, బుక్కరాయ సముద్రం, కంబదూరు, సెట్టూరు, ఆత్మకూరు, యాడికి మండలాల్లోని సుమారు 37 వేల హెక్టార్ల బత్తాయి, నిమ్మ విస్తీర్ణంలో దాదాపు 2,260 హెక్టార్లు నీటి ఎద్దడికి గురైనట్లు వివరించారు. రెండు నెలల క్రితమే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్ పథకానికి హెక్టారుకు రూ.40 వేల వ్యయంపై రూ.22 వేల రాయితీ, డబుల్ లేటరల్ డ్రిప్ వ్యవస్థకు హెక్టారుకు రూ.41,850 వరకు సబ్సిడీ, 20ఇ20ఇ3 మీటర్ల రైతు నీటి కుంటలకు రూ.90 వేల రాయితీతో పాటు ఫెన్సింగ్‌కు అదనంగా రూ.15 వేల సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. వీడ్ మ్యాట్ వినియోగాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి పంటలో గత ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు నమోదైన భారీ వర్షాలు, అధిక తేమ, తగినంత సూర్యరశ్మి లేకపోవడం వల్ల పువ్వులు, పిందెలు రాలిపోవడంతో దిగుబడులు తగ్గాయని తెలిపారు. సాధారణంగా ఎకరాకు 1,000 నుంచి 1,200 కాయల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో 600 నుంచి 800 కాయలకే పరిమితమైందన్నారు. అయితే ఇది పూర్తిగా తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొత్త కొబ్బరి కురిడి వెయ్యింటికి రూ.15,000, పాతకాయ గండేరా రూ.30,000, గుటుగుటు రూ.25,000, కొత్తకాయ గండేరా రూ.28,000, కొత్తకాయ గుటుగుటు రూ.24,000, పాత ముక్కుడు కాయ రూ.15,000-16,000, కొత్త సచ్చి కాయ రూ.15,000-16,000 మధ్య ధర పలుకుతోందని, కొబ్బరి నూనె 15 కిలోల టిన్ రూ.5,000, కిలో ధర సుమారు రూ.350గా ఉందని తెలిపారు. జ్యేష్ఠ మాసం ముగిసిన వెంటనే ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

మరోవైపు రొయ్యల రైతులకు SEAIAP Region పూర్తి భరోసా ఇచ్చిందని, అంతర్జాతీయంగా ఈక్వడార్ తదితర దేశాల్లో ధరలు తగ్గినా, ఒడిశా , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ధరల పతనం ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాల కోసం 100 కౌంట్ రొయ్యలకు కిలోకు రూ.230, 40 కౌంట్‌కు రూ.330, 30 కౌంట్‌కు రూ.430 ధరలను ఈ నెలాఖరు వరకు కొనసాగిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. చిన్న సైజు రొయ్యలను తొందరపడి హార్వెస్ట్ చేయవద్దని, ప్రకటించిన ధరల కంటే తక్కువకు అమ్మవద్దని రైతులకు సూచించారు. గత వారం ఆక్వా ఫీడ్ రేట్లు పెరుగుతున్నాయనే రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సెక్రటేరియట్‌లో ఆక్వా అడ్వైజరీ కమిటీతో అత్యవసర సమావేశం నిర్వహించిందని మంత్రి తెలిపారు. ఆ సమావేశంలో ఫీడ్ ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేసి, పూర్తి విచారణ అనంతరం ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు చెప్పారు. రైతులు ఆందోళన చెందకుండా జిల్లా స్థాయిలో కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు, ఐxూజావీ అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని, రైతు ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వా రంగాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ జూమ్ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖల డైరెక్టర్స్ పాల్గొన్నారు.

# 'లేపాక్షి'కి సాంకేతిక హంగులు




(మొదటి పేజీ తరువాయి)

ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించింది. ఆయా కళారూపాల విశిష్టత, సాంస్కృతి సంప్రదాయలను తెలిపేలా ఏఐ టూల్ ను వినియోగిస్తూ మరో ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో హస్త కళలకు ప్రాచుర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాచీన భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలను హస్త కళారూపాల్లో ప్రస్తుత తరానికి హస్త కళాకారులు అందిస్తూ వస్తున్నారు. సరైన ప్రాచుర్యం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో హస్త కళాకారుల జీవనం భారంగా గడుస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో ప్రభుత్వాలు హస్త కళలకు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. అవి పూర్తిస్థాయిలో హస్త కళాకారులకు భరోసా కల్పించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అటు కళలను ప్రోత్సాహిస్తూనే, ఇటు హస్త కళాకారులకు మెరుగైన జీవనం అందించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీ హెచ్డీసీ) ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఒకవైపు నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తూ, లేపాక్షి షో రూమ్ లకు నూతన హంగులు కల్పిస్తోంది. మరో వైపు హస్త కళాకారులకు నూతన ఆవిష్కరణలు చేసేలా శిక్షణ అందజేస్తోంది. అదే సమయంలో హస్త కళాకారులు రూపొందించిన కళారూపాలను వినియోగదారుల చెంతకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు తరంగా అనే రియల్ టైమ్ వ్యవస్థను, ఏఐ టూల్ తో కళాక్షి అనే యాప్ ను రూపొందించింది. ఈ రెండింటినీ త్వరలోనే ప్రారంభించి, హస్త కళల అమ్మకాలు పెంచేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది.

**'తరంగా'తో లేపాక్షి నిర్వహణ :** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీ హెచ్డీసీ) ఆధ్వర్యంలో 19 లేపాక్షి షో రూమ్ లున్నాయి. వాటిలో ఢిల్లీ, కోల్ కత్తా, హైదరాబాద్ మినహా మిగిలిన 16 షో రూమ్ లూ ఏపీలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా షో రూమ్ ల నిర్వహణలో జిల్లా స్థాయి అధికారుల నేతృత్వంలో సాగుతోంది. ఇకపై అన్ని షో రూమ్ ల నిర్వహణకు రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగేలా తరంగా పేరుతో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించారు. రియల్ టైమ్ లో షో రూమ్ ల నిర్వహణ, స్టాక్ వివరాలు, సిబ్బంది పనితీరు, రోజు వారీ అమ్మకాలు వంటి అంశాలను నేరుగా కమాండ్ కంట్రోల్ ద్వారా ఇకపై పర్యవేక్షించనున్నారు. ఏపీహెచ్డీసీ పరిధిలో అన్ని షో రూమ్ ల్లో హస్త కళారూపాల స్టాక్ తో పాటు వాటి అమ్మకాల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటారు. ఏయే ప్రాంతాల్లో ఏయే కళారూపాలకు డిమాండ్ ఉందో గుర్తించి, అందుకనుగుణంగా సప్లయ్ చేస్తుంటారు. ఏ షో రూమ్ ల్లో అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి... ఎక్కడ తక్కువగా ఉన్నాయో గుర్తించి అందుకు తగట్లు చర్యలు తీసుకోడానికి తరంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఉపయోగపడనుంది. ముఖ్యంగా సిబ్బంది పనితీరును ఏ రోజుకారోజు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

**అలెర్ట్స్ తో సప్లయ్...:** తరంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థలో మరో ముఖ్య అంశం అలెర్ట్స్. ఒక షో రూమ్ ల్లో స్టాక్ తక్కువగా ఉన్నప్పుడు కమాండ్ కంట్రోల్ ద్వారా ఎరుపు రంగులో అలెర్ట్స్ చూపుతుంది. నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు ఆరెంజ్ రంగులో అలెర్ట్స్ చూపుతుంది. ఈ అలెర్ట్స్ తో స్టాక్ పై స్థానికంగా ఉండే షో రూమ్ నిర్వాహాకులతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉండే అధికారులకు కూడా సమాచారం ఎప్పటికప్పుడు అందుతుంది. దీనివల్ల వినియోగదారులకు కళారూపాలను అందివ్వగలుగుతారు. అదే సమయంలో హస్త కళాకారులకు ఆయా కళా రూపాల తయారీకి ఆర్డర్లు అందించే అవకాశం కలుగుతుంది. కమాండ్ కంట్రోల్ ద్వారా ఏయే షో రూమ్ ల్లో స్టాక్ ఎక్కువగా ఉంది గుర్తించి, వాటిని తక్కువ స్టాక్ ఉన్న షో రూమ్ లకు అందించే అవకాశం కలుగుతుంది. దీనివల్ల హస్త కళారూపాల అమ్మకాలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

**వాట్సాప్ లో ఏఐ టూల్ 'కళాక్షి' లింక్ :** ఈ కామర్స్ ద్వారా చేనేత వస్త్రాల డోర్ డెలివరీ మాదిరిగా వినియోగదారుల చెంతకే హస్త కళారూపాలు అందజేయాలన్న సదుద్దేశంతో వాట్సాప్ ద్వారా కళాక్షి పేరుతో సమాచారమందించనున్నారు. ఏఐ టూల్ తో రూపొందించిన ఈ కళాక్షి లింక్ లో హస్త కళా రూపాలు, వాటి తయారీ విధానం, సాంస్కృతి సంప్రదాయ నేపథ్యం వివరించారు. వాటితో పాటు ఆయా కళారూపాలు తయారు చేసే హస్త కళాకారుల గురించి సమాచారం అందిస్తారు. వినియోగదారుడికి కావాల్సిన కళారూపం, వాటి వివరాలను తెలపాలని కోరుతూ సెల్ ఫోన్ లో కళాక్షి వాట్సాప్ లింక్ లో తెలుగులో గాని, ఇంగ్లీష్ గాని టైప్ చేయగానే రెండు మూడు సెకన్ల వ్యవధిలో మొత్తం సమాచారం అందుతుంది. దీనివల్ల హస్త కళా రూపాల ప్రాముఖ్యతతో పాటు హస్త కళాకారుల నేపథ్యం కూడా వినియోగదారులకు తెలుసుకునే సౌలభ్యం కలుగుతుంది. అదే సమయంలో వినియోగదారులకు తమకు కావాల్సిన కళారూపాలను ఇంటి వద్దే ఉండి ఎంచుకునే సదుపాయం కలుగుతుంది. తద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్లకే హస్త కళారూపాలను డోర్ డెలివరీకి అవకాశం కలుగుతుంది.

# రాష్ట్ర ఎపీఎస్ఎఫ్టీవీటీడీసీ చైర్మన్‌గా పి. భరత్ భూషణ్ ప్రమాణ స్వీకారం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్ గా సీహెచ్ మెహర్ రమేష్ లు ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రంలో సినిమా, కళలు, నాటకరంగ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ...తనకు ఈ పదవి ద్వారా సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపారు. 1984లో నందమూరి తారకరామారావు డి.వి.యస్. రాజు అధ్యక్షతన ఇలాంటి పూర్తిస్థాయి కమిటీని వేశారని, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం సినిమా రంగానికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.


శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ రంగంపై ఉన్న ప్రేమతో, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తనకు పూర్తి సహకారం అందించారని, అందుకు వారికి జీవితకాలం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్ ల సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర రంగ అభివృద్ధికి, సినీ పరిశ్రమ విస్తరణకు తన వంతు బాధ్యతగా పూర్తి కృషి చేస్తానని సభాముఖంగా తెలియజేశారు.

లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిక్కాల మెహర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సినిమా పరిశ్రమ పురోగతి సాధిస్తుందన్నారు. ఒకప్పుడు తమిళనాడు, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలివెళ్లిన చిత్ర పరిశ్రమను, మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో ఒక మంచి "ఫిలిం ఫ్రెండ్లీ" వాతావరణం కల్పించేందుకు ఈ బోర్డుని ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్రంలో సినిమా మౌలిక వసతుల అభివృద్ధి చేయడంతో పాటు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. గౌరవ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతోనే తాను ఈ బోర్డులోకి వచ్చానన్నారు.

రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..లి 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో కళలు, సినిమా, నాటకం మరియు టీవీ రంగాలకు ఎలాంటి ప్రోత్సాహం లభించలేదని, ఈ రంగాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల నాయకత్వంలో రాష్ట్రంలో కళల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

గతంలో నిలిచిపోయిన నంది అవార్డుల ప్రకటన, నంది నాటకోత్సవాలను మళ్లీ ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బలోపేతం చేసే విధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్ చిక్కాల మెహర్ రమేష్, బోర్డు డైరెక్టర్ల ఆధ్వర్యంలో తెలుగు సినీ, నాటక, టీవీ రంగాల అభివృద్ధికి సరికొత్త కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అరకు వ్యాలీ, మారేడుమిల్లి, తిరుపతి, అమరావతి వంటి అద్భుతమైన లొకేషన్లు ఏపీలో ఉన్నాయని, కేవలం తెలుగు చిత్రాలే కాకుండా తమిళ్, బెంగాలీ చిత్రాలు కూడా ఇక్కడ షూటింగ్స్ జరుపుకుంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో షూటింగ్ లొకేషన్లకు కొదవలేదని, అయితే సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు వంటి మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నిర్మాతలు, సినీ పెద్దలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు సినిమా పరిశ్రమకు కీలక కేంద్రంగా ఉన్న విజయవాడకు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చలన చిత్ర రంగంలో మళ్లీ పూర్వవైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్ గా చిక్కాల మెహర్ రమేష్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, కమిటీ డైరెక్టర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1975లో ప్రారంభమైన ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర విభజన అనంతరం 2017లో నవ్యాంధ్రలో అంబికా కృష్ణ చైర్మన్‌షిప్‌లో తిరిగి ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా చిత్ర పరిశ్రమకు విజయవాడ ఒక రాజధానిగా, ప్రధాన కేంద్రంగా విలసిల్లిందని, ఇప్పటికీ సినిమాల ఆదాయంలో 65% నుండి 70% వరకు ఆంధ్రప్రదేశ్



నుంచే వస్తుందని పేర్కొన్నారు.

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం, షూటింగులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతుల నుండి పోలీస్ ప్రొటెక్షన్ వం-కు అన్ని ఒకే చోట లభించేలా "సింగిల్ విండో సిస్టమ్" ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఉన్న నంది పురస్కారాలు, కందుకూరి పురస్కారాల వంటి వాటిని పునరుద్ధరించాలని, చలనచిత్ర రంగానికి మరిన్ని రాయితీలు కల్పించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు.

పరిశ్రమను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రస్తుతం థియేటర్ల యజమానులు, పంపిణీదారులు (డిస్ట్రిబ్యూటర్లు), సినీ కార్మికులు కష్టాల్లో ఉన్నారన్నారు. సినిమాను ఎలా తీయాలో ఆలోచించడం పక్కన పెట్టి, చిత్ర పరిశ్రమను ఎలా బతికించుకోవాలి అనేదానిపై ధృష్టి నిలపాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు పూర్తి లాభదాయకంగా ఉండేలా కొత్త ప్రణాళికలతో ముందుకు వస్తున్నామన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా తమ వంతు సహకారాన్ని అందించి ఉభయ రాష్ట్రాలు పరిశ్రమను ఆదుకోవాలని నందమూరి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు.

లితొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ స్వాగతోపన్యాసం చేస్తూ...లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ూూూ- ఖీఋఇజ) చైర్మన్, వైస్ చైర్మన్లు మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలిపారు. 1975లో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఈ సంస్థను ప్రారంభించారన్నారు.

రాష్ట్ర విభజన అనంతరం 2017లో శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏపీలో ఈ ఆఫీస్‌ను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆలోచనల మేరకు అమరావతిని కేవలం తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికే ఒక 'క్రియేటివ్ క్యాపిటల్' (సృజనాత్మక రాజధాని) గా మార్చడం ప్రధాన లక్ష్యం అన్నారు. సినిమా రంగానికి చెందిన అనుభవజ్ఞుల సలహాలు, పర్యాటక శాఖ మంత్రి సహకారంతో ఏపీలో ఫిల్మ్ ఇండస్ట్రీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఏపీఎఫ్డీసీ వేగంగా పనిచేస్తుందని డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

నూతన డైరెక్టర్ గా నియమితులైన హీరో సుమన్ మాట్లాడుతూ.....లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , శాసనసభ్యులు బాలకృష్ణ కలిసి ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమను, సినీ కార్మికులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న విశాఖపట్నం, నెల్లూరు లాంటి సముద్ర తీరాలు, అరకు లాంటి హిల్ స్టేషన్లు, గ్రామీణ ప్రాంతాలు షూటింగులకు ఎంతో అనుకూలమైనవన్నారు. కేవలం తెలుగు చిత్రాలే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, ఉత్తర భారదేశం చిత్రాల షూటింగులు ఇక్కడ జరుపుకునేలా ఆహ్వానించేలాగా చర్యలు ఉంటాయని చెప్పారు. తన అనుభవం, ఇతర భాషల సినిమాలపై ఉన్న అవగాహనతో ఏపీ చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి, స్థానిక కళాకారులు, సాంకేతిక నిపుణుల ఉపాధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని డైరెక్టర్ సుమన్ తల్వార్ హామీ ఇచ్చారు.

డైరెక్టర్ గా నియమితులైన నటి వై. ఝాన్సీ మాట్లాడుతూ...లి రాష్ట్రానికి గతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టీ. రామారావు ముఖ్యమంత్రిగా సేవలందించడం తెలుగు ప్రజలతో పాటు చిత్ర పరిశ్రమ అదృష్టమన్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్ సినిమా రంగం నుంచి వచ్చి రాష్ట్రాన్ని నడిపించడం తెలుగు పరిశ్రమకు ఆశాకిరణమన్నారు. నటసింహం నందమూరి బాలకృష్ణ ఆలోచనతో ఏర్పాటైన ఈ బోర్డులో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్రంలో సినిమా రంగ అభివృద్ధికి చేసిన కృషి ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సినిమా రంగానికి "బాక్సాఫీస్ అన్నపూర్ణ"గా అభివర్ణిస్తూ, అభిమానులు, థియేటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, కలెక్షన్లు అధికంగా ఏపీలోనే ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగాల సమగ్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా చైర్మన్‌తో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, కళాకారులు, ఉన్నతాధికారులతో కూడిన లి17 మంది సభ్యులు డైరెక్టర్లుగాలి ప్రభుత్వం నియమించింది.

**నూతన పాలకమండలి (బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్) వివరాలు :** పి. భరత్ భూషణ్ (చైర్మన్), చిక్కాల మెహర్ రమేష్ కుమార్ (డైరెక్టర్), సుమన్ తల్వార్ (డైరెక్టర్), ఎస్. శివాజీ (డైరెక్టర్), చందలవాడ శ్రీనివాసరావు (డైరెక్టర్), బుర్రా సాయిమాధవ్ (డైరెక్టర్), వై. ఝాన్సీ (డైరెక్టర్), కూచిభొట్ల సుబ్రహ్మణ్య వివేకానంద (వివేక్ కూచిభొట్ల) (డైరెక్టర్),
వి. సముద్ర (డైరెక్టర్), కె. ఉమామహేశ్వరరావు (డైరెక్టర్), మీర్ ఎస్ (డైరెక్టర్), కందిమళ్ళ సాంబశివరావు (డైరెక్టర్), ఎస్. వెంకట కృష్ణారెడ్డి (డైరెక్టర్), జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్ (డైరెక్టర్),డి. సత్యనారాయణ (డైరెక్టర్)

అదనపు కార్యదర్శి, ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ (ఎక్స్-అఫీషియో డైరెక్టర్), జాయింట్ సెక్రటరీ, ప్రభుత్వ ఆర్థిక శాఖ (ఎక్స్-అఫీషియో డైరెక్టర్), మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎక్స్-అఫీషియో డైరెక్టర్ గా వ్యవహరిస్తారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్ వందన సమర్పణ చేస్తూ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, బోర్డు డైరెక్టర్లకు హృదయ పూర్వ అభినంధనలు తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

కార్యక్రమంలో నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, నవ్యంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు, తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఇంఫా ముంబాయికి చెందిన సభ్యులు, టీవీ, నాటక రంగానికి చెందిన ప్రముఖులు.

# లక్ష్యాల సాధనే ధ్యేయంగా ఆర్‌జీ-1లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు



**రామ్‌మందిర్ ఏరియా, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధించడమే ధ్యేయంగా ఆర్‌జీ-1 ఏరియాలో శుక్రవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహించారు. సంస్థ చైర్మన్ మరియు ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ శ్రీ లలిత్ కుమార్ ఆదేశాల మేరకు ఉదయం జీడీకే సి.యస్.పీ (CSP), ఏరియా వర్క్‌షాప్‌లో, సాయంత్రం ఆర్‌సీఓఏ క్లబ్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశాలు జరిగాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27కు సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (PPT) ద్వారా సమగ్ర వివరాలు అందించారు.సమావేశంలో ప్రధానంగా బొగ్గు ఉత్పత్తి పెంపునకు వ్యూహాత్మక ప్రణాళికలు, రవాణా లక్ష్యాల సాధన, మార్కెట్ పోటీని ఎదుర్కొనేందుకు ఖర్చు నియంత్రణ, నాణ్యత ప్రమాణాల మెరుగుదల, కార్మిక సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆర్‌జీ-1 పరిధిలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలంటే అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రాంమోహన్, సివిల్ డీజీఎం ఫైడీశ్వర్, ధనలక్ష్మి భాయి, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం జితేందర్ సింగ్, చంద్రశేఖర్, నారాయణమూర్తి, రాజ్‌కుమార్, హరీష్, స్టాట్యూటరీ మేనేజర్ సుదీర్ జక్కుల్‌వార్, సీనియర్ పీవో శ్రవణ్‌కుమార్, అధికారులు రాజన్న, బ్రహ్మజీ రావు, అశోక్‌రావు, సురేష్, జస్వంత్ తదితరులతో పాటు ఫిట్ సెక్రటరీలు బండి మల్లేష్, రవి మరియు అధిక సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు



**తాండూర్, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) :** గుర్తుతెలియని మృతదేహానికి కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని రైల్వే గేట్ సమీపంలో ఈ నెల 20న లభ్యమైన గుర్తుతెలియని పురుషుడి మృతదేహానికి శనివారం గ్రామపంచాయతీ అధికారులు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. తాండూర్ ఎస్ఐ ప్రసాద్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు చట్టపరమైన విచారణ, పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా, వెంటనే స్పందించిన పంచాయతీ సిబ్బంది, కార్మికులతో కలిసి అంత్యక్రియలు పూర్తి చేశారు. మానవత్వమే ప్రధాన ధర్మం. ఎవరూ లేకపోయినా ప్రతి మనిషికి చివరి గౌరవం దక్కాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ సొంత నిధులతో బాధ్యతాయుతంగా అంత్యక్రియలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు, పోలీస్ అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు. ప్రజా సేవలో భాగంగా మానవీయ విలువలను కాపాడటం స్థానిక సంస్థల బాధ్యత అని గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు.

# కదిరి సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో నీ భద్రత మా బాధ్యత అవగాహన కార్యక్రమం



**తనకల్లు, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) :** సత్యసాయి జిల్లా పోలీస్ శాఖకు చెందిన సతీష్ కుమార్, ఐ పి ఎస్ ఆదేశాల మేరకు, కదిరి సబ్ డివిజన్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో "మీ భద్రత మా బాధ్యత" అనే నినాదంతో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం నల్లచెరువు లిమిట్స్ లోని దేవిరెంటి పల్లి విలేజ్ మరియు ఎస్ సీ కాలనీ తనకల్లు, మరియు సంత మార్కెట్ తనకల్లు,తనకల్లు టౌన్ ఏరియా లో అవగాహన చేపట్టబడింది. గ్రామ మహిళలు, యువతికి భద్రతకు సంబంధించిన ముఖ్య అంశాలపై శక్తి టీమ్ సభ్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పి ఓ సి ఎస్ ఓ చట్టం, చైల్డ్ మ్యారేజెస్ నివారణ, మరియు సైబర్ క్రైమ్ ప్రమాదాలు మరియు నివారణ చర్యలు గురించి వివరించారు.అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ వినియోగంతో పాటు, 100, 112, 101, 1098, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను వెంటనే సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ ఇంచార్జ్ ఏ ఎస్ ఐ తిరుపాల్, పోలీస్ కానిస్టేబుల్స్ చలపతి, షౌకత్ ఖాన్, అనూష పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్







**కదిరి (జర్నలిస్ట్ ఫైల్) :** కదిరి పట్టణం నందు నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించి మున్సిపల్ అధికారులతో ,స్యానిటేజేషన్ వారితో కలసి చీపురు పట్టి రోడ్డు ఊడ్చిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ కమిషనర్ సందీప్ ,మున్సిపల్ అధికారులు,టీడీపి నాయకులు పాల్గొన్నారు

# అధికారుల అలసత్వం... పాలకుల నిర్లక్ష్యం.

- జంట నగరంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం చూడతరమా..
- వెంటనే మరమ్మత్తులు చేపట్టాలనీ డిమాండ్
- సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయాలి
- స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవు
- కుల రాజ్యాధికార పార్టీ కూటమి పొలిట్ బ్యూరో సభ్యుడు వడ్డే ఎల్లయ్య





**గుమ్మడిదల, మే 24 :** సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉన్న 1969 తెలంగాణ అమరవీరుల స్థూపం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై దయనీయ స్థితిలో ఉందని కుల రాజ్యాధికార పార్టీ కూటమి పొలిట్ బ్యూరో సభ్యుడు వడ్డే ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మారక చిహ్నాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు.ఇటీవల పొలిట్ బ్యూరో సభ్యులు బి.ఎన్. జాంబావ, బెల్లి చంద్రశేఖర్ యాదవ్, ముక్క ప్రభాకర్ మాదిగ, బద్దుల అఖిల్ చంద్ర కలిసి సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారని తెలిపారు. స్థూపం చుట్టూ సరైన నిర్వహణ లేకపోవడం, మరమ్మత్తులు అవసరమైన పరిస్థితి ఉండటం పట్ల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.జూన్ 2వ తేదీలోపు ప్రభుత్వం స్పందించి స్థూపానికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, ప్రాంగణంలో శాశ్వత భద్రతా సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.పభుత్వం ఆలస్యం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని వడ్డే ఎల్లయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపకుడు బొమ్మల మైసయ్య, ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య, మాల మహా రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు కొంగర నరహరి, ప్రధాన కార్యదర్శి నీరుడి శ్రీనివాస్, వడ్డేర రాజ్యాధికార పార్టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు కోట్ల 66 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే



**జర్నలిస్ట్‌ఫైల్**పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పటాన్చెరు సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి శర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు. పాల్గొన్నారు

# జాబితాపూర్‌లో మహిళ ఆత్మహత్య

**జగిత్యాల, మే 24 (జర్నలిస్ట్ ఫైల్):** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారిశెట్టి కవిత (40) భర్త రవి తో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసిక ఆందోళనకు గురవుతున్న కవిత, శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతురాలి భర్త మారిశెట్టి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

# రైతున రాజు చేసిన ఘనత కేసీఆర్‌దే

**-రైతులను అరిగోశపెట్టిన నాయకుడు రేవంత్ రెడ్డి**
**-దావ వసంత సురేష్**



**రాయికల్, మే 24 (జర్నలిస్ట్ ఫైల్):** రాయికల్ మండలం ఆలూరు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి జిల్లా తొలి తాజా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని ఆరోపించారు. రైతులు ధర్నా చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు.రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడదనే సామెతలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో రైతులు పంట పండించడం ఒక ఎత్తయితే, దాన్ని అమ్ముకోవడం మరో ఎత్తుగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెన్నెముకైన రైతును రాజుగా నిలబెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుదేనని, తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా మారడానికి ఆయన పాలన కారణమని పేర్కొన్నారు.ఎండ తీవ్రత, మరోవైపు కల్లాల్లో నిల్వ ఉన్న వడ్లతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వర్షాలు ముందుగా వచ్చే అవకాశంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. రైతును రాజు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారని ఆరోపించారు. రైతుబంధు పూర్తిగా విడుదల కాకపోగా, చేతికొచ్చిన పంటను కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు.ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామంటూ పత్రికా ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేదని, ప్రస్తుతం రైతులను అరిగోశపెడుతున్న నాయకుడు రేవంత్ రెడ్డేనని విమర్శించారు."ప్రజా పాలన -- ప్రగతి పాలన" పేరుతో సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం, కల్లాల్లో ఉన్న వడ్లు కొనుగోలు చేయకపోవడమేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ప్రజాపాలన పేరిట దరఖాస్తులతో ప్రజలను మభ్యపెట్టి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి ఎక్కడ ధాన్యం నిల్వ ఉందో అక్కడ వెంటనే కొనుగోలు పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బర్కాం మల్లేష్, ఆనంద్ రావు, సుధాకర్, పాక్స్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్‌లు స్వామిరెడ్డి, గంగాధర్, నాయకులు ఎండి చాంద్, మల్లారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఆడెపు కృష్ణ, నందు నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్ పోటీల్లో భూపతిపూర్ విద్యార్థుల ప్రతిభ



**రాయికల్, మే 24 (జర్నలిస్ట్ ఫైల్):** జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియం లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండల స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ విద్యార్థులు చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో మూడపెల్లి చైత్ర ప్రథమ, తీగల శాన్వి ద్వితీయ స్థానాలు సాధించగా, బాలుర విభాగంలో నక్క మనీష్ ప్రతిభ కనబరిచాడు.విజేత విద్యార్థులను జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ అభినందించి మెమెంటోలు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ కోల రాజగోపాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఉపసర్పంచ్ సంజీవ చారి, హెచ్ఎం యు.వి. రమణి, సీనియర్ ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు శంకరయ్య, సత్యనారాయణ, భవాని తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

# వడదెబ్బతో బర్రల కాపరి వెంకటేష్ మృతి





**బెల్లంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** బెల్లంపల్లి మండలంలోని పెద్దపనపల్లి గ్రామానికి చెందిన పోలగాని వెంకటేష్(38) వడదెబ్బతో మృతిచెందాడు. బర్రలను మేపుతూ జీవనం సాగించే వెంకటేష్ ఈ నెల 22న ఉదయం బర్రలను కాయడానికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అనంతరం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ మృతిచెందగా, వడదెబ్బ కారణంగానే మరణించినట్లు వైద్యులు నిర్ధారించిన్నట్లు తెలిపారు

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య







**బెల్లంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తో బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామ శివారులోని రైతుల సాగునీటి బోర్లు, స్ప్రింక్లర్ పైపులు, మామిడి, టేకు, ఎర్రచందనం తోటలు కాలిపోయిన ఘటన స్థలాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపరిశీలించారు . విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. సుమారు 300 స్ప్రింక్లర్ పైపులు, 200 ఎకరాల తోటలు దగ్ధమై రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడిచినా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఎవరు ఇప్పటివరకు స్పందించలేదని అయన విమర్శించారు.నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం పరిహారం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద టేకు దిమ్మల పట్టివేత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (జర్నలిస్ట్ ఫైల్) :

భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మలను ఫారెస్ట్ సిబ్బంది పట్టుకున్నట్లు సమాచారం. తనిఖీల సమయంలో ఆటోలో తరలిస్తున్న టేకు దిమ్మలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారంలో బేరాలు, రాయబారాలు జరుగుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అక్రమ కలప రవాణాపై అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఫారెస్ట్ సిబ్బంది, స్థానికులు ఘటన స్థలంలో ఉన్నట్లు సమాచారం.

## తాళ్లకొమ్మూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

-- ముగ్గురి పరిస్థితి విషమం.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : మణుగూరు నుండి భద్రాచలం వెళ్తున్న ఆటో తాళ్లకొమ్మూరు క్రషర్ మిల్లు సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపిన 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ



వెంకటరమణ ఖమ్మం,మే 24 (జర్నలిస్ట్ ఫైల్):ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో ఆ ప్రాంత ప్రజలు విద్యుత్ సరఫరా విషయంలో అనేక చోట్ల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయాన్ని డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దృష్టికి తెచ్చారు. వారు తక్షణమే స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలకు పూనుకున్నారు. శనివారం 44వ డివిజన్ లో వేసవికాలం కావడంతో లెనిన్ నగర్ లో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ లోడ్ సరిపోక గత మూడు రోజుల నుండి విద్యుత్ అంతరాయం కలగడంతో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లాగా వెంటనే స్పందించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ తుమ్మల యుగంధర్, విద్యుత్ ఏఈ, డిఇ సహకారంతో 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ ని తొలగించి 160 కేవీ ట్రాన్స్ఫార్మర్ ను అమర్చడం జరిగింది. ఈ కొత్త ట్రాన్స్ఫార్మర్ అమర్చటం పట్ల డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేసి 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వేలాడుతున్న విద్యుత్ తీగలు

### పట్టించుకోని అధికారులు, భయాందోళనలో గ్రామస్థులు



(నిజామాబాద్ రూరల్ సిరికొండ జర్నలిస్ట్ ఫైల్ ప్రతినిధి )నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సిరికొండ మండలం తాళ్ల రామడుగు లోని వీధులలో ఇండ్ల పైకప్పులకు అతి సమీపంగా మరియు రోడ్లకు ఇరువైపులా విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరమైన రీతిలో వేలాడుతున్నాయి. గాలివాన వచ్చినా, లేదా కాస్త గట్టిగా గాలి వీచినా ఈ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి. ఒక్కోసారి ఇండ్ల గోడలను, పైకప్పులను తాకేలా ఈ వైర్లు కిందకు వంగిపోవడంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు వృద్ధులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారు.గ్రామ వీధుల్లో నడిచేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు గతంలో పలుమార్లు విన్నవించినప్పటికీ, స్పందించటం లేదు పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ ప్రమాదకరమైన విద్యుత్ తీగలను సరిచేయాలని, లూజ్ వైర్లను బిగించి స్తంభాలను క్రమబద్ధీకరించాలని గ్రామ ప్రజలు పత్రికా ముఖంగా



డిమాండ్ చేస్తున్నారు ఇదే విదంగా ప్రధానంగా గ్రామానికి వచ్చే విద్యుత్ తీగలు కూడా చెట్ల మధ్యలో ఉండి గాలి వచ్చినపుడు మాటలు రేగుతున్నాయి అని లైన్మెన్. ఎ ఇ గార్లకు పలుమార్లు విన్నవించిన స్పందించడం లేదు అని గ్రామ ప్రజలు వాపోయారు ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రధాలు జరగక ముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## జూన్ 2 నుండి 13వరకు యమునానదికి పుష్కరాలు



ఖమ్మం,మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : 2026 జూన్ 2 వ తేదీ నుండి 13 వ తేదీ వరకు 12 రోజుల పాటు యమునానదికి పుష్కరాలు జరుగుతాయని సీనియర్ జర్నలిస్ట్, జ్యోతిష్య పండితులు ఎస్ వి సూర్యనారాయణ తెలిపారు. జూన్ 1 వ తేదీ అధిక జ్యేష్ట బహుళ పాడ్యమి సోమవారం రాత్రి దేవగురుడు బృహస్పతి కర్కాటక రాశిలో ప్రవేశించుటవలన మరుసటి దినము 2 వ తేదీ మంగళవారం నాడు యమునానదికి పుష్కరాలు ప్రారంభం అవుతాయని ఆయన తెలియజేసారు. ఈ నది యమునోత్రి అనే ప్రాంతంలో ఉద్భవించిందని, యమునానది అతి పవిత్రమైన జీవనది అని స్పష్టంచేశారు. ఈ నది హర్యానా రాష్ట్రం లో ప్రవహించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని ఢిల్లీ, నోయిడా, మధుర, బృందావనం, ఆగ్రా నగరాలలో ప్రవహిస్తోందని తెలిపారు. గంగానది, యమునానది, అంతర్వాహినియైన సరస్వతీ నది కలిసి ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమం ఏర్పడుతుందని వివరించారు. ఎంతో పవిత్రమైన యమునానది శ్రీకృష్ణ పరమాత్మ పాద స్పర్శతో పునీతమైందని ఆయన తెలిపారు. పుష్కరకాలం 12 రోజులలో యమునానది లో సంకల్పపూర్వకం గా స్నానమాచరించి జప, తప, దాన, పిండ ప్రదానములు చేయుటవలన ఉత్తమ ఫలితములు కలుగునని సూర్యనారాయణ తెలియజేసారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ మణుగూరు ప్రతినిధి,(జర్నలిస్ట్ ఫైల్):

సింగరేణి కాలరీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా పి.వి. కాలనీ భద్రాద్రి స్టేడియంలో గత నెల 28 నుండి నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. సింగరేణి ఉద్యోగుల పిల్లల (18 సంవత్సరాల లోపు బాలబాలికలు) కోసం నిర్వహించిన ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఏరియా ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి మాట్లాడుతూ... బాల్య దశ నుంచే పిల్లలకు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వల్ల వారిలో ఉత్సాహం, చురుకుదనం, పట్టుదల రెట్టింపు అవుతాయన్నారు. వేసవి సెలవుల్లో బాలబాలికలు తమ సమయాన్ని వృధా చేసుకోకుండా, వారిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రతి ఏటా ఉచితంగా శిక్షణ ఇస్తోందని తెలిపారు.ల్లల ఆసక్తికి అనుగుణంగా ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, కరాటే, బాస్కెట్‌బాల్ విభాగాల్లో అనుభవజ్ఞులైన శిక్షకులతో ఈ శిక్షణ ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జీఎం హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ నేర్చుకున్న క్రీడలను భవిష్యత్తులోనూ తమ దినచర్యలో భాగం చేసుకుని, నిరంతర సాధనతో ఉత్తమ క్రీడా కారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

**ఆకట్టుకున్న కరాటే ప్రదర్శన:**

ఈ వేడుకల్లో కరాటే విభాగంలో శిక్షణ పొందిన బాలబాలికలు చేసిన సాహసోపేతమైన డెమో (ప్రదర్శన) అందరినీ విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలుందుకుంది. అనంతరం, నెల రోజుల పాటు శిక్షణలో చురుగ్గా పాల్గొన్న బాలబాలికలకు ముఖ్య అతిథి ఏరియా ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, గుర్తింపు సంఘం మరియు ప్రాతినిధ్య సంఘం నాయకులతో కలిసి స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ , గుర్తింపు సంఘం నాయకులు మేకల ఈశ్వర్ , ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు , డబ్ల్యూ పిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి డి. నరేశ్ , స్పోర్ట్స్ కో- ఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు , క్రీడా విభాగాల శిక్షకులు, సింగరేణి ఉద్యోగులు మరియు ఆయా క్రీడా విభాగాలలో ట్రైనింగ్ ఇచ్చిన శిక్షకులు, పెద్ద సంఖ్యలో బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఆరోగ్య భరోసా 'సీఎంఆర్ఎఫ్'

**- 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి - ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేత**



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అత్యవసర వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 150 మంది



లబ్ధిదారులకు తన సిఫారసుతో మంజూరైన రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ, లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి, అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**- ఆటో డ్రైవర్లు, కార్మికులకు అండగా ఉంటాం**

అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వందమంది ఆటో డ్రైవర్లకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరంతరం శ్రమిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులందరికీ తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అభయమిచ్చారు.ఈ కార్యక్రమాల్లో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, డీసీసీ సెక్రెటరీ రాంపుడి రోశయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎస్డి. గౌస్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణా రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, ఎండి. గౌస్, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఉభయ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలెపు దంపతులకు అభినందనల వెల్లువ



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ దంపతుల వివాహ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం డివిజన్ లో పలు చోట్ల పాలెపు అభిమానులు, స్నేహితులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు.



తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు 44 వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు,మైనార్టీ నాయకులు, సీపీఐ నాయకులు, సీపీయం నాయకులు,కార్యకర్తలు, 44 వ డివిజన్ ప్రజలు పాల్గొని పాలెపు విజయ వెంకటరమణ దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్ మజీద్ సెంటర్లో నివసించే ఎస్ కే రహీం పాషా పాముకాటుతో మృతి చెందాడు. గత నాలుగు రోజుల క్రితం తన ఇంటిని మరమ్మత్తులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు.

## ఇందిరమ్మ చీరలు అందని ద్రాక్షేనా...!

- 36 వ డివిజన్ లో అధికార పార్టీ మాజీ కౌన్సిలర్ నిర్వాకం
- ఆ డివిజన్ లో అడుగు అడుగున మహిళలకు అన్యాయమే
- ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం జరిగేనా...
- అభివృద్ధి ప్రధాత మంత్రి కే మచ్చ తెస్తున్న వైనం. పంపిణీ లో నిర్లక్ష్యం చేస్తున్న కమీషనర్, మోప్మా, కార్పొరేషన్ అధికారులే అనే అనుమానం.....



ఖమ్మం , (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల అన్ని డివిజన్లలో ఇందిరమ్మ చీరలను మహిళలకు సజావుగా పంపిణీ జరిగింది . అయితే ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతంలో గల 36 వ డివిజన్ లో మాత్రం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయకుండా రోజుల తరబడి జాప్యం చేస్తున్నారు. ఈ తీరును పరిశీలిస్తే ఇందిరమ్మ చీరలు అందని ద్రాక్షేనా అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఇందులో ఆ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ను కాదు అని అధికార పార్టీ కి చెందిన మాజీ కౌన్సిలర్ నిర్వాకం తో పలు చోట్ల తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు అడుగు అడుగున అన్యాయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందిరమ్మ రాజ్యంలో ఆ మహిళలకు న్యాయం జరిగేనా అనే అనుమానం కలగమానదు. నలభై ఏళ్ల అభివృద్ధి ప్రధాత గా అని చెప్పుతున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి ఇలాంటి నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల మచ్చ తెస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. పేరుకే పవర్ చుట్టే రాజకీయం నడుస్తోంది అని చెప్పక తప్పదు. కానీ క్రింది స్థాయిలో మాత్రం ఆ మాజీ కౌన్సిలర్ ప్రమేయంతోనే ఖమ్మం నగర పాలక సంస్థ కు చెందిన కమిషనర్,మోప్మా, నగర పాలక సంస్థ అధికారుల తీరు పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే ఈ చీరలను అదే ప్రాంతంలో గల ఓ క్లబ్ లోని గోడౌన్ లో మూలాన మూలుగుతూ ప్లాస్టిక్ బస్తాలలో ఉచ్చి నిల్వ చేస్తున్నారు. ఇన్ని రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వరకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేద్దాం అనే అలోచన రాక పోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, మంత్రి సైతం స్పందించి డివిజన్ లో జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఇందిరమ్మ చీరల పంపిణీ కి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.



# నూతన సీఐ కర్రె స్వామికి జర్నలిస్టుల స్వాగతం..

ప్రజల పక్షాన నిలవాలని ఆకాంక్ష



వరంగల్ ప్రతినిధి మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ నగరంలోని తూర్పు ప్రాంతానికి చెందిన మాల జర్నలిస్టులు ఆజంజాహీ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కొత్త సీఐగా బాధ్యతలు చేపట్టిన కర్రె స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పర్యావరణ హితంగా ఓ పూలమొక్కను బహూకరించి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నిత్యం ప్రజల పట్ల అత్యంత నిబద్ధతతో వ్యవహరించాలని వారు ఆకాంక్షించగా.. సీఐ సైతం ఓ స్థానికుడిలా అంతే సానుకూలంగా స్పందిస్తూ అందరి సహకారంతో బాధ్యతగా ముందుకు సాగుతానని భరోసా ఇచ్చారు. సీఐ ని కలిసిన వారిలో బండి రవి,జక్కుల విజయ్ కుమార్, నీలం శివ,రవి తేజ,కిరణ్ కుమార్, బందెల కృష్ణ,క్రాంతి ఉన్నారు..

## రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే

# సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు

- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతర శ్రమ, మరిన్ని నిధుల సాధన

చుంచుపల్లి, కొత్తగూడెం, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీట

- రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు
- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి



చుంచుపల్లి, కొత్తగూడెం, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా



పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## జన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీట

- రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు
- మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రధాన ధ్యేయం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే పిహెచ్సి
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతర శ్రమ, మరిన్ని నిధుల సాధన

చుంచుపల్లి, కొత్తగూడెం, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ

- రూ.4.75కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నాం- నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం- రూ.34లక్షలతో రెడ్డిపాలెం సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం- రూ.45లక్షలతో నిర్మించిన ఎంఆర్సి భవనం అందుబాటులోకి వచ్చింది
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటాం- రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో పల్లెల రూపురేఖలు మారుస్తాం- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావుద- సుజాతనగర్ మండలంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



సుజాతనగర్, కొత్తగూడెం, మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణం ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడం జరిగిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ.5.54 కోట్ల నిధులకు సంబంధించి శనివారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ రూ.4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.34 లక్షలతో రెడ్డిపాలెం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రూ.45 లక్షలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఎంఆర్సి భవనాన్ని కూడా ఈ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని, మండలంలో విద్యాసంబంధిత సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని, వాటి శంకుస్థాపన పూర్తేచేశామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ వి వరప్రసాద్, ఎంపిడివో భారతి, ఆరడబ్ల్యుఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్, ఎంఈ ఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్, భూక్యా శ్రీనివాస్, గుమ్మడిల్లి దర్గయ్య, బొద్దు కేశవరావు, గారికె ఉపేందర్, నరేష్, ముక్కెర మురళి, దండు సురేష్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరం

: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- యువత ప్రతిభకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం- జాబ్ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేత- కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వస్తేనే విజయాలు సాధిస్తాం- 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన -- కనెక్టింగ్ టాలెంట్ విత్ అవర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్- 2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గతంలో సాధారణంగా కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా అనేక క్రీడల్లో యువత ప్రతిభ కనబరుస్తోందని, ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో కూడా పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సుమారు 50 వేల కోట్ల సంపద సంపాదించి నప్పటికీ ఆరోగ్య సమస్యలతో చిన్న వయసులోనే మరణించారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని, కానీ ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని అన్నారు. ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజ లో ఉంటుందని, ఇక్కడ మంచి మౌలిక వసతులు ఉన్నాయని, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టితే దీర్ఘకాలం క్రీడల్లో కొనసాగవచ్చని సూచించారు.ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, కొందరికి మేధస్సు, కొందరికి సంగీతం, నృత్యం, మరికొందరికి క్రీడల్లో ప్రతిభ ఉంటుందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు.ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు. జాబ్‌మేళాలో 618 మంది ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. సీఎం కప్ రాష్ట్ర స్థాయి పతక విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రతి విజయం జీవితంలో ఒక మైలురాయిగా నిలవాలని, అది భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. యువత అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

: మోర శ్రీకాంత్ ముదిరాజ్. బలరాంనగర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



నేరెడ్ మెట్ ,మే 24 : వేసవి ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బలరాంనగర్ డివిజన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డివిజన్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ ముదిరాజ్ తెలిపారు. శనివారం ఓల్డ్ పీస్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు టీ. వెంకటేష్ యాదవ్, బి బ్లాక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.కే. శ్రీనివాస్ హాజరై ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మోర శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లదనం కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ - పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఖమ్మం,మే 24(జర్నలిస్ట్ ఫైల్): పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు,ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చినపుడు హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆ ప్రకటనలో తెలిపారు.

# చంద్రధన లో స్టేజి నాటకానికి విశేష స్పందన

-నేటి తరంలో నాటి కళ ల కు పునర్జీవం -చంద్రధన లో విశేషంగా ఆకట్టుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి మహత్యం, వీధి నాటకం



మే 24 (జర్నలిస్ట్ ఫైల్) : తలకొండపల్లి: తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో భక్తి శ్రద్ధలతో కలియుగ దైవం, కోటానికోట్ల భక్తుల హృదయాల్లో నిండిన శ్రీ మహా విష్ణు అవతారం, శ్రీ వెంకటేశ్వర మహత్య స్టేజీ నాటక చంద్రధన గ్రామంలో విశేషంగా ఆకట్టుకోవడం జరిగింది. ఈ నాటక ప్రదర్శనకు గ్రామ సర్పంచ్ సోల్లు రంగమ్మ కుమారుడు



సొల్లు సుధాకర్ వంతుగా 5,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మరియు ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి 5,000/-అలాగే బి ఆర్ ఎస్ నాయకులు మైసగాళ్ల శేఖర్ 10116/- కటి కెల శేఖర్ యాదవ్ 3000/-వార్డు సభ్యులు ఇట మోని అజయ్ 1000/- ఓర్సు రాజు (అంకుశం)1000/-మాజీ సర్పంచ్ బేగరి రాములు 1000/-మాజీ యాదవ సంఘం అధ్యక్షులు నిదురం యాదయ్య 1016/-మోక్తల జంగయ్య గౌడ్ 550/- రూపాయలు తమ వంతుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరినీ అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ,సనాతన సంస్కృతి మరియు సంప్రదాయాలను ప్రజలకు చేరవేసే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో గొప్పవని తెలిపారు.గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ,భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో ముందుండి సహకరిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు సర్పంచ్, ఉప సర్పంచ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు ఓర్సు రాజు(అంకుశం),అజయ్ ,ముసిలి పార్వతమ్మ వెంకటయ్య,గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మోక్తల జంగయ్య గౌడ్,కటికేల శేఖర్ ,మైసగాళ్ల శేఖర్,వనం నర్సింహ,పురుషోత్తం,సొల్లు మల్లయ్య,నాటకం సభ్యులు,కమిటి సభ్యులు,ఇతరులు పాల్గొన్నారు

# ఎండ తీవ్రత 45 డిగ్రీలు దాటవచ్చు జాగ్రత్తలు పాటించండి



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): వాతావరణ సూచనలు మేరకు జిల్లాలో ఎండ తీవ్రత 45 డిగ్రీలు దాటవచ్చుని, ప్రజలు అందరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రానున్న ఐదు రోజులలో వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని సూచించిందని అన్నారు. 41° సెల్సియస్ నుండి 50° సెల్సియస్ వరకు ఎండ వేడిమి ఉండవచ్చని తెలియజేసిందన్నారు. వడ దెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఎవరు బయటకు రావద్దని సూచించారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు.

చిన్నారులు, వయసు మీరినవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపి, తలపాగా వంటివి ధరించాలన్నారు.

చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, కళ్ళ రక్షణ కోసం సన్‌గ్లాసె-స్ ఉపయోగించాలని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రియాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజలకు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

జన కూడళ్ల వద్ద నీడను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ, భవన నిర్మాణ, ఇతర బహిరంగంగా చేసే శ్రమతో కూడిన పనులను చల్లగా ఉండే ఉదయం, సాయంత్రం సమయాలకు మార్పు చేయాలని ఆదేశించారు. వడదెబ్బ తినకుండా జాగ్రత్తలు చేపట్టాలని, అత్యవసర సమయాల్లో సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి తగిన వైద్య సేవలను పొందాలని సూచించారు.

# బక్రీద్‌కు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం
- వేసవి దృష్ట్యా ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తాం
- ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు ఈద్గాలను పరిశీలించిన కూటమి నాయకులు

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలని కూటమి నాయకులు అధికారులను కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు ఆదివారం కూటమి నాయకులు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఈద్గాలను పరిశీలించారు.

అధికారులతో కలిసి వేసవి దృష్ట్యా ఈద్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పిస్తామన్నారు. తాగు నీరు, టెంట్లు వంటి వాటికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. నమాజ్ చేయడానికి ముందు కాళ్లు, చేతులు కడుక్కోవడానికి (వుజూ చేసుకోవడానికి) వీలుగా నీటి ట్యాంకర్లు, తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈద్గా మైదానాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. భక్తులు కూర్చోవడానికి, నమాజ్ చేసుకోవడానికి వీలుగా మైదానమంతా కార్పెట్లు పరుస్తామన్నారు. నమాజ్ సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాను ఉంచేలా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈద్గాల వైపు వచ్చే దారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రార్థనలకు వచ్చేవారి వాహనాల పార్కింగ్ కు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ప్రథమ చికిత్స అందించడానికి వైద్యులు, సిబ్బందితో కూడిన ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బక్రీద్ ఏర్పాట్ల కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తారని, ఎమ్మెల్యే నసీర్ సూచనలతో బక్రీద్ ప్రార్థనలు ఇబ్బంది లేకుండా జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు.

# నారా లోకేష్ విజన్‌తో నిడమర్రులో అంతర్జాతీయ ప్రమాణాల మోడల్ స్కూల్





- రూ.16 కోట్లతో ఆధునిక సదుపాయాలు..
- దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన విద్యాసంస్థ

మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రులో అంతర్జాతీయ ప్రమాణాలతో తొలి మోడల్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ప్రాజెక్టు విద్యారంగంలో ఆదర్శంగా నిలుస్తుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

సుమారు 5.2 ఎకరాల విస్తీర్ణంలో రూ. 16 కోట్ల వ్యయంతో నిడమర్రు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఈ మోడల్ స్కూల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. విద్యార్థులకు సాంకేతికత ఆధారిత విద్యను అందించే లక్ష్యంతో తరగతి గదుల్లో గ్రీన్‌బోర్డులు, చార్ట్ బోర్డులు, డిజిటల్ పాఠాల కోసం ఐఎఫ్పీ ప్యానెల్స్, ఆధునిక టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేశారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ఫుట్‌బాల్ కోర్టు, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫ్లడ్ లైట్లు, హ్యాండ్బాల్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోసం మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నిర్మించారు. సుమారు 400 మంది విద్యార్థులు వీక్షించేలా యాంఫి థియేటర్‌ను ఏర్పాటు చేశారు.

ఇక సైన్స్ మ్యూజియం, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్, గ్రంథాలయం వంటి ఆధునిక విద్యా సదుపాయాలు కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా కిచెన్ గార్డెన్, పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను పెంచే ఏర్పాట్లు చేశారు. 500 మంది విద్యార్థులకు సరిపడే డైనింగ్ హాల్, ఆర్వో తాగునీటి ప్లాంట్, 40 సీసీ కెమెరాలతో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

చిన్నారుల కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ పార్క్, అధ్యాపకుల కోసం లిఫ్ట్ సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ స్థలం కూడా ఏర్పాటు చేశారు. ఏ-బ్లాక్‌లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల కోసం 28 గదులు, ప్రిన్సిపల్ రూం, స్టాఫ్ రూం నిర్మించగా, బీ-బ్లాక్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం 12 తరగతి గదులు ఏర్పాటు చేశారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేలా గోడలపై ఆకర్షణీయ చిత్రాలు వేయించడంతో పాటు సాంకేతికత ఆధారిత బోధనకు ప్రాధాన్యతనిస్తూ ఈ పాఠశాలను విద్యారంగంలో కొత్త దిశగా తీర్చిదిద్దినట్లు అధికారులు తెలిపారు.

# పిల్లలూ... ప్రశాంతంగా రాయండి... ఉత్తీర్ణత సాధించండి

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): సోమవారం నుండి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పదవ తరగతి పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులు అందరూ పరీక్షలను ప్రశాంతంగా రాయండి... ఉత్తీర్ణత సాధించండి అంటూ జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, అప్పుడే పరీక్షలు బాగా రాయగలరని సూచించారు. పరీక్షలు రాస్తున్న 3 వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

పదవ తరగతి పరీక్షలు జీవితంలో కీలకమని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అందుకే రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పదవ తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు తరగతులు ఏర్పాటు చేశారని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రమించారని, తల్లిదండ్రులు పిల్లల ఉత్తీర్ణత కోసం ఎదురు చూస్తున్నారని, పరీక్షలు బాగా రాసి విజయదుందుభి మోగించి కానుకగా అందించాలని, వారి కళ్ళల్లో ఆనందం చూడాలని కోరారు.

పదవ తరగతి పరీక్షలు బాగా రాసి ఉన్నత విద్యను అందుకోవాలని జీవితంలో ఉత్తమ స్థానంలో నిలిచి సమాజానికి సహాయం చేసే స్థాయిలో ఉండాలని స్ఫూర్తిని నింపారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ఎంతో మంది జీవితంలో ఉన్నత స్థానాలు సాధించారని ప్రేరణ కల్పించారు.

పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాత్రి ప్రశాంతంగా నిద్రపోయి ఉదయం లేచి పరీక్షలకు వెళ్లి ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. 18 పరీక్ష కేంద్రాలలో రెగ్యులర్ పదవ తరగతి విద్యార్థులతో పాటు, ఓపెన్ స్కూలింగ్ ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులు రాయడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుటకు ఆర్.టి.సి బస్సులు వేశారని, పరీక్ష కేంద్రాల్లో ప్రాథమిక అవసరాలైన తాగునీరు, విద్యుత్తు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉందని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ తో పాటు అత్యవసర మందులను సిద్ధంగా ఉంచడం జరిగిందని చెప్పారు. వేసవి తీవ్రత రీత్యా కొద్దిగా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# డిజిటల్ మహానాడును విజయవంతం చేయండి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ పిలుపు





వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న 'డిజిటల్ మహానాడు' (పసుపు పండగ)ను వినుకొండ నియోజకవర్గంలో ఘనంగా విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారి మహానాడును డిజిటల్ వేదికగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, వినుకొండ నియోజకవర్గంలోని 13 క్లస్టర్లలో ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ ఈ డిజిటల్ మహానాడులో పెద్ద ఎత్తున పాల్గొని, ఈ పసుపు పండగను గ్రాండ్ సక్సెస్ చేయాలని జీవీ కోరారు.

# పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు సిద్ధం

- పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు
- 25 పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు కొనసాగుతోంది.

మే 25 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించబడుతున్నాయి. పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా పోలీసులు కఠిన తనిఖీలు చేపడుతున్నారు.

పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలు చేస్తూ, ఎవరూ గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇన్విజిలేటర్లు, పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులు కేంద్రాల వద్ద ఉండకుండా పర్యవేక్షిస్తున్నారు. ప్రశ్నపత్రాల భద్రత దృష్ట్యా పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ప్రింటింగ్ కేంద్రాలను పరీక్షలు ముగిసే వరకు మూసివేయించే చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పరీక్షల సమయంలో మొబైల్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయి. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నారు.

పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాల డిపాజిట్ ప్రక్రియకు ప్రత్యేక ఎస్కార్ట్ భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో నేడు మెగా జాబ్ మేళా



- ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు సోమవారం నాడు జరిగే మెగా జాబ్ మేళా ను బ్రహ్మంగారిమఠం మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని వినియోగించుకోగలరని ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ పత్రిక ప్రకటనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కళాశాల కరస్పాండెంట్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ డి ఎల్ రవీంద్ర రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కే వల్లి కళాశాల కమిటీ సభ్యులు ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి ఆశీస్సులతో కడప లోని కొప్పర్తి నందు నిర్మించిన ఛానల్ పే కంపెనీ వారితో సంప్రదించి మా కళాశాలలో నేడు మెగా జాబ్ మేల నిర్వహించి బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించి వారి నిరుద్యోగతను తొలగించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా మా కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఇందుకుగాను 10వ తరగతి ఆ పైన విద్యా అర్హత కలిగిన వారు పాల్గొనవచ్చునని ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతంతో ఉచిత భోజనం వసతి రవాణా సౌకర్యంతో పాటు వైద్య సౌకర్యం కంపెనీవారు కల్పిస్తారని కావున బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగం పొందగలరని ఆయన తెలిపారు

# రౌడీ షీటర్లకు గుంటూరు పోలీసుల కౌన్సిలింగ్

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లా పోలీసులు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

కౌన్సిలింగ్ సందర్భంగా రౌడీ షీటర్లు, కేడీలు, చెడు నడత కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రౌడీ షీటర్లు, కేడీలు, డీసీలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజలను ఇబ్బంది పెట్టడం, బెదిరింపులకు పాల్పడటం లేదా ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలు నిర్వహించినట్లయితే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పి.జి.ఆర్.ఎస్‌కు ప్రాధాన్యత

- పి.జి.ఆర్.ఎస్ కు టోల్ ఫ్రీ నంబర్ 1100

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసి అర్జీల పరిస్థితి తెలుసుకునే ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ దరఖాస్తులను పి.జి.ఆర్.ఎస్ తో పాటు "మీకోసం" వెబ్ సైట్ లో ఆన్ లైన్ లోను సమర్పించవచ్చని తెలిపారు. అర్జీల వివరాలు Meekosam.ap.gov.in(మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి నెల నాలుగవ శనివారం ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పి.జి.ఆర్.ఎస్ ను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

# జిల్లాలో ఖరీఫ్ 2026కు సిద్ధం : జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి

- ఎరువుల పంపిణీ కార్డ్ ద్వారా పంటకు ఎంత యూరియా, డి.ఏ.పి ఎరువులు అవసరమో ముందుగానే సూచించి పంట వేసిన రోజు నుండి మూడు దఫాలుగా అందించడం జరుగుతుంది



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):జిల్లాలో ఖరీఫ్ 2026కు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ జిల్లాలో జూన్ రెండవ వారంలో ప్రారంభం కానుందన్నారు. ఈ సంవత్సరం "ఎల్ నినో" వల్ల వం-షపాతం కొంత తగవచ్చని అంచనా ఉందని, అయితే ప్రస్తుతానికి పరిస్థితులు సాధారణంగా ఉందని చెప్పారు. 2025 – 26 ఖరీఫ్ లో విస్తారంగా కురిసిన వర్షాలు, పుష్కలంగా కాలువల ద్వారా నీటి లభ్యత కారణంగా రికార్డు స్థాయిలో 96,192 హెక్టార్లలో వ్యవసాయ పంటలు సాగు కాగా వరి 66,103 హెక్టార్లలో సాగు చేయడం జరిగిందని వివరించారు. ఖరీఫ్ 2024 సీజన్ కంటే 9,314 హెక్టార్లు అధికమన్నారు. ఇప్పటికీ కృష్ణా నదిలో సరిపడ నీటి లభ్యత దృష్ట్యా జులై మొదటి వారంలో పంట సాగుకు నీరు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించిందని, ప్రభుత్వ ఆదేశాల దృష్ట్యా జిల్లాకు ఖరీఫ్ కు 18,600 క్వింటాళ్ళు వరి విత్తనాలు అవసరంకాగా, ఏపి సీడ్స్ (ఘూరాజుజుణం), ప్రైవేట్ సంస్థల ద్వారా ఖరీఫ్ కు కావలసిన వరి విత్తనాలు జూన్ మొదటి వారంలోనే రైతులకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. జిల్లాకు 1.5 లక్షల బి.టి ప్రత్తి విత్తన సంచులు అవసరం కాగా, ఇప్పటికే జిల్లాకు కావలసిన విత్తనాలు అందుబాటులోకి తేవడం జరిగిందని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉండేలా జిల్లాలోని అన్ని విత్తన ఉత్పత్తి కేంద్రాల తనిఖీలు ఇప్పటికే పూర్తి చేశామని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా నమూనాల సేకరణ జులై మొదటి వారానికి పూర్తి చేసే విధంగా వ్యవసాయ అధికారులు విత్తన నమూనాలు తీయడం జరుగుతుందని తెలిపారు.

భూసారం పెంచడానికి ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం పచ్చిరొట్ట పంట విత్తనాలు పంపిణీ ప్రారంభించి 1,639 క్వింటాళ్ళు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులోకి తేవడం జరిగిందని వివరించారు. పి.యమ్.డి.ఎస్ (ఋతు పవనాలకు ముందుగా పొడిదుక్కి సాగు విధానం) విధానంలో జిల్లాలో 18,637 విత్తన సంచులు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విధానంలో నాటిన పంటను ఫలసాయం కొరకు, ఋతు పవనాలు ఆశాజనకంగా ఉన్నచోట్ల పచ్చి రొట్ట పంటగా కూడా మార్చడం జరుగుతుందన్నారు. ఖరీఫ్ 2026కు జిల్లాకు 57 వేల టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే జిల్లాలో 63 శాతం ఎరువులు – 12,588 టన్నుల యూరియా, 4,931 టన్నుల డి. ఏ. పి., 16,207 టన్నుల కాంప్లెక్స్, 1,180 టన్నుల పొటాష్, 1,464 టన్నుల సూపర్ ఫాస్పేట్ వెరసి 36,371 టన్నుల ఎరువులు నిల్వ చేయడం జరిగిందని చెప్పారు. గత సంవత్సర అనుభవం దృష్ట్యా ఎరువుల పంపిణీ కార్డులు మే నెలాఖరు లోగా రైతు సేవ కేంద్రాల ద్వారా వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పంట సాగుచేసే రైతులకు ఇవ్వటానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎరువుల పంపిణీ కార్డ్ ద్వారా రైతులు జిల్లాలో తాము వేసిన పంటకు ఎంత యూరియా, డి.ఏ.పి ఎరువులు అవసరమో ముందుగానే సూచించి పంట వేసిన రోజు నుండి మూడు దఫాలుగా అందించడం జరుగుతుందన్నారు. కౌలుదారులకు కూడా ఎరువుల పంపిణీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. జిల్లాకు ఇప్పటికే వ్యవసాయ యంత్ర పరికరాల నిమిత్తం రూ. 3.04 కోట్ల మంజూరు కాగా, రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఖరీఫ్ ఆరంభంలోగా పరికరాల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీ కూడా రైతు సేవ కేంద్రాలలో జరుగుతుందని, ఆత్మ (ఏ.టి.ఎం.ఏ) ద్వారా సమతుల్య ఎరువుల వాడకం, "ఎల్ నినో" పరిస్థితులలో చేయపట్టదగిన సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఖరీఫ్ 2026 సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, వ్యవసాయ రుణాలు, నీటి పారుదల కాలువల మరమ్మతులు, సమయోచిత సాంకేతిక సూచనలు, నూతన సాగు విధానాలపై అవగాహన కార్యక్రమాల ప్రణాళికలతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ ఖరీఫ్ 2026 కు ప్రణాళికా బద్ధంగా సంసిద్ధతతో ముందుగు సాగుతోందని వివరించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్సీ అలపాటి



తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు స్థానిక రామలింగేశ్వరపేటలో గల ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఆ కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరై సమస్యలు పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చే అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు సమస్య పరిష్కరిస్తామనే భరోసా కల్పించారు ఆలపాటి రాజేంద్రప్రసాద్. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజల నుండి రెండు అంకెల సంఖ్య వరకు అర్జీలు అందాయని వెల్లడించారు. ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామన్న విధానాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ కుదూస్, రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలే బీజేపీకి అసలైన బలం : కేంద్ర మంత్రి భూపతిరాజు

- పునాదిపాడులో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్




కంకిపాడు, (జర్నలిస్ట్ ఫైల్): పోలింగ్ బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతి కార్యకర్తను సమర్థవంతమైన నాయకుడిగా తీర్చిదిద్దడమే భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న ప్రశిక్షణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.
కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలోని కనకమేడల గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్" శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, జాతీయవాదం, స్పష్టమైన సిద్ధాంతాలతో ఏర్పడిన గొప్ప కుటుంబమని అన్నారు. జిల్లా ప్రశిక్షణ వర్గలో భాగంగా కార్యకర్తలకు పార్టీ చరిత్ర, సిద్ధాంత పటిమ, అంత్యోదయ విలువలపై సవివరంగా అవగాహన కల్పించారు.
దేశాభివృద్ధే లక్ష్యంగా పార్టీ ఆశయాలకు కట్టుబడి పని చేసే ప్రతి కార్యకర్తే బీజేపీకి నిజమైన బలమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.
మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రజలతో మరింత మమేకం కావాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అంతకుముందు బీజేపీ ప్రముఖ నాయకుల చరిత్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్‌ను కేంద్ర మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, మండల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వమే ధ్యేయం!

### ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత!



తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్ ) : తెనాలి నియోజకవర్గంలోని 11 మంది వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రివర్యులు ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) నుంచి రూ. 4,63,060/- నాలుగు లక్షల అరవై మూడు వేల అరవై రూపాయలు) మంజూరైంది. ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి 11 మంది కుటుంబ సభ్యులకు రూ 4,63,060/- ఆయన అందజేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలపాటి మాట్లాడుతూ ఆపద సమయంలో ఉన్న నిరుపేదలను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నాసులు కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బలమైన భారత నిర్మాణానికి బీజేపీ కార్యకర్తలే పునాది



- సైద్ధాంతిక నిబద్ధత కలిగిన బీజేపీ కార్యకర్తలే దేశానికి బలం
- బిజెపి జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్

పెనుగొండ (జర్నలిస్ట్ ఫైల్) :దేశం ముందు ఉన్న సవాళ్లను ఎదుర్కొనే శక్తి సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కార్యకర్తలకే ఉంటుందని బిజెపి జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా పెనుగొండలో నిర్వహించిన "పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ అభియాన్-2026" కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.
దేశం అభివృద్ధి చెందాలంటే జాతీయవాద ఆలోచనలు, సేవాతత్వం, సిద్ధాంత బలం, దేశాభివృద్ధికి అంకితభావం అనే నాలుగు సూత్రాలతో ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బలమైన కార్యకర్తలే బలమైన భారత నిర్మాణానికి పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ అంత్యోదయ సిద్ధాంతం ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ బలోపేతం, సమాజ సేవ, దేశాభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, సిద్ధాంతాల ఆధారంగా పనిచేసే కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.
యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడంలో పార్టీ కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర రెడ్డి మాట్లాడుతూ, శిక్షణా వర్గాలు కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భారత గౌరవాన్ని నిలబెట్టిన మహామేధావి అంబేద్కర్ : మంత్రి కందుల దుర్గేష్

- జీడిగుంటలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ
- ఎస్సీ కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు హామీ



నిడదవోలు, (జర్నలిస్ట్ ఫైల్): భారతదేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించి ప్రపంచ దేశాల ముందు భారత గౌరవాన్ని నిలబెట్టిన మహోన్నత మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు రూరల్ మండలం జీడిగుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన మంత్రి దుర్గేష్, "అందరికీ జై భీమ్" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.
సమాజంలో దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు. చిన్ననాటి నుంచి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, అత్యున్నత విద్యను అభ్యసించి దేశానికి ఏకగ్రీవంగా రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు.
మహిళల హక్కులు, కార్మికులు, కర్షకుల సంక్షేమం కోసం కూడా అంబేద్కర్ విశేషంగా కృషి చేశారని అన్నారు.
పర్యటనలో భాగంగా గ్రామంలోని శిథిలావస్థకు చేరిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి పరిశీలించారు. భవనాన్ని మరమ్మతు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేయగా, నెల రోజుల్లోనే పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. వెంటనే చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
అనంతరం గ్రామస్థులతో మమేకమైన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ప్రసంగం సందర్భంగా గ్రామంలో "జై భీమ్", "జై అంబేద్కర్" నినాదాలు మారుమోగాయి. అంబేద్కర్ ఆశయాలను అందరూ కలిసి ముందుకు తీసుకెళ్లాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

## ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకురాలు వావిలాల లీలా మహేశ్వరి మృతి

- బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, వెల్ఫేర్ కార్పొరేషన్ ప్రతినిధుల సంతాపం



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకురాలు కుమారి వావిలాల లీలా మహేశ్వరి మృతి పట్ల బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, రంగావజ్జుల లక్ష్మీపతి, పాలపాటి రవికుమార్‌లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
1939 జూన్ 4న గుంటూరులో జన్మించిన లీలా మహేశ్వరి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పద్మభూషణ్ వావిలాల గోపాల కృష్ణయ్య కుటుంబానికి చెందినవారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఆమె, తన సోదర సోదరీమణులను ఉన్నత చదువులు చదివించి వారి జీవితాలను స్థిరపరిచారు.
గుంటూరులోని సెయింట్ ఇగ్నీషియస్ బాలికల పాఠశాలలో, అనంతరం శ్రీ బండ్లమూడి హనుమాయమ్మ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందించిన ఆమె, వేలాది మంది విద్యార్థినులకు మార్గదర్శకురాలిగా నిలిచారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.
సామాజిక సేవ పట్ల అంకితభావంతో స్కౌట్స్ అండ్ గైడ్స్, రెడ్ క్రాస్ సంస్థలకు నాలుగు దశాబ్దాలకుపైగా సేవలందించారు. 1981 నుంచి గుంటూరులోని వావిలాల సంస్థలో కార్యదర్శి, చైర్మన్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సారా నిషేధ ఉద్యమం సహా పలు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.
కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న లీలా మహేశ్వరి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమె మరణం విద్యా, సామాజిక రంగాలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు.

## కర్ణాటకలో ఘోర పడవ ప్రమాదం.. 8 మంది మృతి!



కర్ణాటక (జర్నలిస్ట్ ఫైల్) : నదిలో ముత్యపు చిప్పల వేటకోసం వెళ్లిన పడవ బోల్తా పడిన ఘటన కర్ణాటక రాష్ట్రంలో చోటుచేసుకుంది. ఉత్తర కన్నడ జిల్లా భత్కల్ సమీపంలోని వెంకటాపుర నదిలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 8 మంది మరణించినట్లు తెలుస్తోంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శిరాలీ పరిధిలోని శారదాహోళె గ్రామానికి చెందిన 14 మంది ఆదివారం నదిలోకి ముత్యపు చిప్పల కోసం పడవలో బయల్దేరారు. నదిలోకి వెళ్లే కొద్దీ ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో వారంతా ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. ఆ నీటి ఉద్ధృతిలో పడవలో ఉన్నవారంతా కొట్టుకుపోయారు. ఈ ప్రమాదాన్ని గ్రహించిన స్థానికులు వెంటనే భత్కల్ రూరల్ పోలీసులకు సమాచారమిచ్చి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికే 8 మంది మరణించినట్లు సమాచారం. కొందరిని మాత్రం సురక్షితంగా రక్షించి, స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు గల్లంతవ్వగా.. వారి ఆచూకీ కోసం మత్స్యకారులు, రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మరణించినవారిలో ఏడుగురు మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు.
వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో వారి కుటుంబాల్లో, శారదాహోళె గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఆపదలో ఆదుకునే నాయకుడు అచ్చెన్నాయుడు



- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- టెక్కలి మండలానికి చెందిన నలుగురికి రూ.2.42 లక్షల ఆర్థిక సాయం

నిమ్మాడ, (జర్నలిస్ట్ ఫైల్ ) : కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తూ ఆపద్బాంధవుడిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టెక్కలి మండలానికి చెందిన నలుగురు బాధితులకు మొత్తం రూ. 2,42,587 ఆర్థిక సాయాన్ని మంత్రి అందజేశారు.
అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం అందింది. పి. తులసి లక్ష్మికి రూ. 64,579, ఎం. మహాలక్ష్మికి రూ. 61,529, ఎస్. విమలకుమారికి రూ. 66,280, పి. శివసాయికి రూ. 50,019 చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.
చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చులతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో మంత్రి తమ సమస్యను గుర్తించి వెంటనే స్పందించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా త్వరితగతిన ఆర్థిక సాయం అందేలా చేసి తమ కుటుంబాలకు ఊరటనిచ్చారని తెలిపారు.
"కన్నీటిలో ఉన్న సమయంలో మమ్మల్ని ఆదుకున్న మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం" అంటూ లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకాష్ రాజ్‌పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి : బీజేపీ డిమాండ్



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీఅపై సినీ నటుడుప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రధానమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి చులకన భావంతో మాట్లాడటం అనుచితమని కమిటీ పేర్కొంది.
ఈ మేరకు బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు విడుదల చేసిన ప్రకటనలో, 140 కోట్ల మంది భారతీయులకు ప్రతినిధిగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం సుమోటోగా తీసుకుని ప్రకాష్ రాజ్‌పై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.
ఎన్నికల్లో పోటీ చేసి కనీస డిపాజిట్లు కూడా సాధించలేని వ్యక్తులు దేశ ప్రధానిని విమర్శించే స్థాయికి దిగజారడం బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో తప్పుదారి పట్టించే పరిస్థితులకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గుంటూరు జిల్లా కమిటీ హెచ్చరించింది.

## గుంటూరు కార్పొరేషన్ వార్డుల పునర్విభజనపై 134 అభ్యంతరాలు



- జూన్ 8లోపు తుది నివేదిక ప్రభుత్వానికి పంపింపు

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 57 ఎన్నికల వార్డులను 76 వార్డులుగా పునర్విభజించేందుకు విడుదల చేసిన ప్రతిపాదిత ముసాయిదాపై మొత్తం 134 అభ్యంతరాలు అందినట్లు కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం మార్చి 24న జారీ చేసిన జీవో నెం. 65తో పాటు సీడీఎంఏ ఉత్తర్వుల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ వార్డుల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18న ప్రతిపాదిత ముసాయిదాను ప్రకటించగా, అభ్యంతరాల స్వీకరణకు మే 24 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.
వార్డుల పునర్విభజనకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందినట్లు తెలిపారు. మొత్తం 134 అభ్యంతరాల్లో 132 వినతులు నేరుగా, మరో 2 వినతులు ఆన్‌లైన్ ద్వారా అందాయని వెల్లడించారు.
ఈ అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన సవరణలు చేపట్టి పూర్తి స్థాయి తుది నివేదికను సిద్ధం చేసి జూన్ 8లోపు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# చింతపల్లిపాడులో ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

- గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్





గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చింతపల్లిపాడు గ్రామంలో ప్రజలు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులుతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ విగ్రహాలు ప్రజలకు, రోడ్ల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పక్కన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండుటెండలను లెక్కచేయకుండా ఎన్టీఆర్ విగ్రహాలను ప్రతిష్ఠించిన గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కృషిని ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పట్టణాలు, గ్రామాలన్న తేడా లేకుండా రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తిలో ఇచ్చిన రూ. 12 వేల కోట్ల అభివృద్ధి నిధులను వినియోగించుకోలేక వదిలేశారని విమర్శించారు.
చింతపల్లిపాడు గ్రామ చెరువు అభివృద్ధికి ఇప్పటికే రూ. 48 లక్షలు మంజూరయ్యాయని, అదనంగా అవసరమైన రూ. 30 లక్షల నిధులు కూడా సమీకరించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో క్యాన్సర్ బాధితులు అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 18 కోట్లతో ఏర్పాటు చేసిన పీఈటీ స్కాన్ పేద క్యాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
దాదాపు ఆరు దశాబ్దాల కల అయిన గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయించామని, ప్రస్తుతం పనులు ప్రారంభమైనట్లు ప్రకటించారు. చెరువుల్లో పూడిక తొలగింపుకు ఎక్స్‌కవేటర్ అందుబాటులోకి తీసుకొస్తామని, రైతుల ఆదాయం పెంచేందుకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో గ్రామాల వారీగా అధ్యయనాలు నిర్వహిస్తామని వెల్లడించారు.
ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని, ముఖ్యంగా మహిళల మనసుల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తీవ్ర ఎండలను లెక్కచేయకుండా ప్రజలు, కార్యకర్తలు ఘనంగా విగ్రహావిష్కరణ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు రూ. 1200 కోట్లతో శ్రీకారం చుట్టిన ఘనత మంత్రి పెమ్మసానికే దక్కుతుందని కొనియాడారు.
కార్యక్రమంలో భాగంగా ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467